ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఆదివారం 05 జూలై 2026 | సంపుటి: 28 సంచిక: 92

Sunday 05 July 2026 | Vol.No 28 Issue No .92

హైదరాబాద్ | Hyderabad

పేజీలు: 12+12

వెల: రూ.1.00

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం | కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

## ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుంటా

### 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రేవత్ భావోద్వేగ పోస్ట్





హైదరాబాద్,జులై4 : ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానం తన జీవితంలో ప్రత్యేక అధ్యాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. తన రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం గురించి ఎక్స్‌లో భావోద్వేగ పోస్ట్ చేశారు. ఈ 20వసంతాల ప్రయాణం ఎన్నో విజయాలు, మరెన్నో సవాళ్లు... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం...అధికారంలో ఉన్నా,

మిగతా2లో..



## రేవంత్ రెడ్డికి బండి శుభాకాంక్షలు

హైదరాబాద్,జూలై4: ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శు భాకాంక్షలు తెలియజేశారు.

మిగతా2లో..




## మిడ్జిల్‌లో నాటిన మొక్క.. మహావృక్షమైంది






- పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం
- పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు వచ్చారు
- పాలమూరు బిడ్డలు పార పట్టగలరు..పాలన చేయగలరు
- మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది
- మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత ఇక భట్టిదే
- బిఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు
- ఆ కుటుంబాలకు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయి
- మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్,జూలై4 : ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ

మిగతా2లో..

## పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ,జులై4 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై

మిగతా2లో..

## నిజామైన ప్రజానాయకుడు మన రేవంత్

- ప్రజల కోసం పరితపించే పెద్ద మనసు ఆయన సొంతం
- నిరంతరం పేదల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న వ్యక్తి
- మిడ్జిల్ సభలో సిఎం రేవంత్‌పై భట్టి ప్రశంసలు



నాగర్‌కర్నూలు,జూలై4 : తనను ఆదరించిన ప్రజల దీవెన పొందాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డిది పెద్ద మనసని డిప్యూటి సిఎం భట్టి విక్రామార్క అన్నారు.

మిగతా2లో..

## నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

- అపరిశుభ్ర వాతావరణం.. కల్తీ పదార్థాలు
- దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు
- వందరోజుల్లో 185 కేసులు నమోదు

హైదరాబాద్,జులై4 : ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ,

మిగతా2లో..

## యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి
- అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
- రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోదీ






జయపుర,జులై4 :పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోదీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్

మిగతా2లో..



## అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

- క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు
- ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో సమన్వయంతో పనిచేయాలి
- అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్ధేశం

హైదరాబాద్,జూలై4 :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు

మిగతా2లో..

## భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

- అప్పలపై తప్పడు లెక్కలు,
- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- బిఆర్ఎస్ దిగిపోయేనాటికి అప్ప రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే.
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్,జూలై4 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా2లో..

## ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- ఆహార భద్రతను కట్టుదిట్టంగా అమలు
- డ్రగ్ కంట్రోలర్ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు కలసి పనిచేయాలి
- అధికారులకు సిఎస్ సంజయ్ జాజు ఆదేశం

హైదరాబాద్,జూలై4 :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ

మిగతా2లో..



## వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయండి
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్,జూలై4 : తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సిఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షభావ పరిస్థితులను అధిగమించేందుకు జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని, దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించిన ఆయన, రైతులకు సకాలంలో నాణ్యమైన

మిగతా2లో..

## సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం - సీఎం

- కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎం
- డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం
- పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు

మిగతా2లో..




## అయోధ్య విరాళాల చోరీతో దిద్దుబాటు చర్యలు

- ఇకనుంచి లెక్కింపులో కఠిన నిబంధనలు
- లెక్కింపు సిబ్బందికి సెల్‌ఫోన్ల నిషేధం
- జేబులు లేని దుస్తులు వేసుకునేలా ఆదేశాలు
- నిరంతరం సిసి టివిల పర్యవేక్షణలో నేలపై లెక్కింపు

అయోధ్య,జూలై4 : అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల లెక్కింపు వ్యవస్థలో కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. విరాళాల లెక్కింపు వ్యవస్థలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. విరాళాలు లెక్కించే సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లు, కెమెరాలు, బ్యాగులు, ఇతర వ్యక్తిగత వస్తువులు ఉపయోగించడంపై పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. టేబుళ్లు, కుర్చీల దగ్గర

మిగతా2లో..



## కవితకు ఎన్నికల సంఘం షాక్

- టిఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్
- అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
- అవసరమైతే సుప్రీంను ఆశ్రయిస్తామని వెల్లడి



హైదరాబాద్,జులై4 : కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు

మిగతా2లో..

## ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సిఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, పంటల వైవిధ్యం పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని సీఎస్ స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యా శాఖకు సంబంధించి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి, అక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రాధాన్యతా అంశాలన్నింటినీ కలెక్టర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిరంతర సమీక్షలు జరపాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

## ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుంటా

ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతోనే తన అనుబంధాన్ని కొనసాగించినట్లు తెలిపారు. మిడ్జిల్‌లో సాధారణ రాజకీయ కార్యకర్తగా ప్రారంభమైన తన ప్రయాణం, ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రజల గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే స్థాయికి చేరడం వెనుక ప్రజల విశ్వాసమే కారణమని సీఎం పేర్కొన్నారు. లక్షల అక్షరాలతో రాసినా... కోట్ల పదాలతో చెప్పినా... ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్న రేవంత్ రెడ్డి... ప్రతి సందర్భంలో, ప్రతి సంఘటనలో, ప్రతి సంఘర్షణలో తనతో కలిసి నడిచిన ప్రజలు, కార్యకర్తలు, ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సేవకుడిగా తన బాధ్యతను నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా...'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి బండి శుభాకాంక్షలు

శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడా కష్టపడి పైకొచ్చినవారే అని అన్నారు. సీఎం రేవంత్ 6 గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. సర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని కేంద్ర మంత్రి విమర్శించారు. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందన్నారు. మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

## పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## నిజామైన ప్రజానాయకుడు మన రేవంత్

ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదలను ఆదుకోవాలన్న ఆకాంక్ష రేవంత్ రెడ్డిలో ఉన్నాయని అన్నారు. రేవంత్‌ను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనలో ఉదాత్తమైన ఆశయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. కేవలం అధికారుల సలహాలకే పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆకలి లేని సమాజమే లక్ష్యంగా కోటి పదిహేను లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోందని భట్టి విక్రమార్క వివరించారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అక్కాచెల్లెమ్మలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే అజెండాగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత పాలకుల హయాంలో నిరంతరం భయంతో బతికిన తెలంగాణ ప్రజలకు, నేడు నిజమైన స్వేచ్ఛా స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించిన ధీశాలి రేవంత్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కొనియాడారు.

## నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెచ్-ఫాస్ట్ అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదవగా... పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు హెచ్-ఫాస్ట్ అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ఈఎఈక్ష విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనర్

# మిడ్జిల్‌లో నాటిన మొక్క.. మహావృక్షమైంది

నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా?





మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా అని అన్నారు. కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిడ్జిల్ డార్క్ మండల కాదు.. వెలుగు రేఖ అని నిరూపించాలన్నారు. 2006లో జెడ్పీటీసీగా తనపై పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వ పదవి ఇస్తామని చెప్పారు. పేదల మధ్య పెరిగిన తనకు పేదల కష్టాలు, సమస్యలు తెలుసని అన్నారు. కానీ దొరలకు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఉండదన్నారు. అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,ఎంపి మల్లు రవి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలన్నారు. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయన్నారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం' అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం - సీఎం

కుప్పం, జూలై 4 : సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతీ అంశంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటన రెండో రోజు కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు, వైద్యారోగ్య రంగంలోని ఆవిష్కరణలు, డ్రగ్స్ నివారణ చర్యలపై అధికారులతో మాట్లాడారు. డిజిటలైజేషన్ తో పాటు డేటా ఇంటిగ్రేషన్ అవసరంకుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంత మందికి సేవలు అందించగలరని సీఎం ప్రశ్నించారు. రోజుకు 30?40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆస్పత్రిని పరిశీలన సందర్భంగా ఆవరణలో కొంత మేర చెత్త కనిపించడంపై ప్రశ్నించిన ముఖ్యమంత్రి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే ముఖ్యమని పేర్కొన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు. డయాలసిస్ వార్డును సందర్శించిన సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు వివరించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని, కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.గంజాయి నియంత్రణపై కఠిన చర్యలుపంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు అక్కడ మొక్క నాటారు. వైద్యారోగ్య రంగంలో వివిధ ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమాచారం అందించేలా ఓ పరికరం రూపొందించిన విద్యార్థిని సీఎం అభినందించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగయ్యేందుకు సహకారం అందిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం?స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖమంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కవితకు ఎన్నికల సంఘం షాక్

జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

## భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులను చెబుతున్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారు. తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారిపోవు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తోందని అన్నారు.

### అయోధ్య విరాళాల చోరీతో దిద్దుబాటు చర్యలు

కాకుండా.. సిబ్బంది నేలపై కూర్చునే విరాళాలను లెక్కించాలని ఆదేశించింది. డ్రెస్ కోడ్‌ను తప్పని సరి చేసింది. సిబ్బంది జేబులు లేని డార్క్ బ్లూ యూనిఫామ్ మాత్రమే ధరించాలని ఆదేశించింది. విరాళాలు లెక్కించే సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లు, కెమెరాలు ఉపయోగించడాన్ని నిషేధించింది. అదే విధంగా సదరు సిబ్బంది ఎలాంటి జేబులు లేని ప్రత్యేకమైన దుస్తులను ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇకపై, హుండీ లెక్కింపు హాలులోకి సిబ్బంది ప్రవేశించడానికి ముందు వారికి రెండంచెల భద్రతా తనిఖీలు నిర్వహించనున్నారు. విరాళాల లెక్కింపు విధానంలో కూడా సమూల మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇకనుంచి సిబ్బంది బల్లలు, కుర్చీల వద్ద కాకుండా, నేలపై కూర్చొనే విరాళాలను లెక్కిస్తారని తెలిపారు. నగదు, ఇతర విలువైన వస్తువులు దాచుకొనేందుకు అవకాశం లేకుండా ఉండేలా సిబ్బందికి జేబులు లేని ముదురు నీలం రంగు యూనిఫాం ఇవ్వనున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఖాతాలపై ఆడిట్ నిర్వహించడానికి సిట్ సిద్ధమవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గత ఐదేళ్లలో ఆలయ నిర్మాణానికి అయిన ఖర్చులు, ఆలయానికి వచ్చిన విరాళాలు, నిధులను వారు సమీక్షించనున్నారు. దొంగలించిన నగలను ఎవరూ గుర్తు పట్టకుండా ఉండడానికి నిందితులు వాటిని కరిగించి.. బంగారు బిస్కెట్లుగా మార్చుకొని ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. విరాళాలు లెక్కించే సిబ్బందిని కౌంటింగ్ హాలులోకి పంపడానికి ముందు రెండు సార్లు సెక్యూరిటీ స్క్రీనింగ్ చేయనున్నారు. విరాళాలు లెక్కించే హాలు 24 గంటల పాటు నిరంతరం సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంటుంది. గతంలో లాగా ఫుటేజ్ డిలీట్ అవ్వకుండా ఉండేలా డేటా స్టోరేజ్ గడువును కూడా పెంచారు. కాగా, ప్రత్యేక విచారణ బృందం సూచనల మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ కఠినమైన నిబంధనలను అమలులోకి తెచ్చింది.

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని ర్గి÷నైరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర ర్గి÷నైరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# సంపాదకీయం

## సర్ పక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోద్రై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్దమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది.

## వీడియో కాన్ఫరెన్స్ లో సంజయ్ జాజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి04 జులై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు మరియు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయం, త్రాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యం, విద్య, వాతావరణ పరిస్థితులు, ఉద్యానవనం, ఆయిల్ పామ్ విస్తరణ, రైతు రిజిస్ట్రీ, సూక్ష్మ సాగునీరు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ాఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, వానాకాలం-2026 వ్యవసాయ సీజన్‌ను విజయవంతం చేసేందుకు అన్నిశాఖలుసమన్వయంతోపనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, ఎరువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ నమోదు వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని సూచించారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు, తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో అమలు చేయాలని, ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని,ఫేషియల్ రికగ్నిషన్ విధానం, డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పథకం అమలును సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి




ఇచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. వానాకాలం వ్యవసాయ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచుతామని, రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని, జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటల సాగులో విశేష కృషి జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో త్రాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోన సాగిస్తున్నామని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంనిర్వహిస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సరూపారాణి, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి శాస్త్రి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, జిల్లా ప్రణాళిక అధికారి దశరథ్, ఎస్ఈ మిషన్ భగీరథ వెంకట్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం

### ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి బ్యూరో, జూలై :04(విజన్ ఆంధ్ర)తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. శనివారం నాడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని సండే మార్కెట్ వద్ద ఉన్న దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి , డాక్టర్ శ్రీహరి, పుష్ప నగేష్, లాడే మల్లేశం, లాడే బాలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

## రైతు భరోసాతో జిల్లా రైతుల జీవితాలలో వెలుగులు

### 175.23 కోట్ల రూపాయలతో 1 లక్ష 19 వేల 979 మంది రైతు కుటుంబాలకు అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం..

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి . జూలై 4,( విజన్ ఆంధ్ర)వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం. అలాంటి రైతు కుటుంబాలకు ప్రతి పంట సీజన్‌లో ఆర్థిక ధైర్యాన్ని అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మరోసారి విజయవంతమైంది. వానాకాలం ' 2026 సీజన్‌లో జిల్లాలోని 1,19,979 మంది రైతుల ఖాతాల్లో 175.23 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం నేరుగా జమ కావడంతో రైతు కుటుంబాలలో ఆనందం వెల్లివిరిసింది.సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం నేరుగా పెట్టుబడి సహాయాన్ని అందించడం వల్ల వ్యవసాయ పనులు ఆలస్యం కాకుండా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లో రైతులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా వ్యవసాయ పనులలో నిమగ్నమవుతున్నారు. ఈ పథకం ద్వారా అందుతున్న సహాయంతో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సకాలంలో సాగు పనులు చేపడుతున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలలో నిధులు జమ కావడం వల్ల రైతులకు పూర్తి ప్రయోజనం చేకూరుతోంది.జిల్లాలోని గిరిజన, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో భరోసాను కల్పిస్తోంది. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకోవాల్సిన అవసరం తగ్గి, రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. రైతు భరోసా ద్వారా అందుతున్న నిధులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తూ స్థానిక వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి.రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని రైతు భరోసా మరోసారి నిరూపించింది. రైతు శ్రమకు విలువనిస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామీణాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 67.44 లక్షల మంది రైతులకు 7,135.77 కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల కాగా, అందులో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కూడా విశేషంగా లబ్ధి పొందింది. ఈ సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడమే కాకుండా, వానాకాలం సాగును విజయవంతంగా ప్రారంభించేందుకు కీలకంగా మారింది.రైతు భరోసా పథకంపై జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయూత అందిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు రైతు భరోసా పథకం నిలువెత్తు నిదర్శనమని, "రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది - గ్రామం బాగుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతుల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులే ఈ పథకం విజయానికి అసలైన నిదర్శనమని తెలిపారు.

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

### -కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూలై 04..నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని.. ఆయన పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఉన్నతాధికారులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్,వివిధ శాఖల అధికారులు తదితరులు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీర్ల బీరయ్య, కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే రాజు, జిల్లా సహాయ కార్యదర్శి



జూలపల్లి రఘునందన్, కురుమ సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్, పంచాయతీ కమిటీ జిల్లా అధ్యక్షుడు కోరే గట్టయ్య, కురుమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శవాల అక్షయ్, కురుమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ మీస రమాదేవి, కురుమ సంఘం రామడుగు మండల అధ్యక్షుడు కడారి వీరయ్య, మీస మాధురి, చిట్కూరు శ్రీనివాస్, యోగేందర్, గడ్డల కోమలత, కర్రె రవి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సేవే విండోల లక్ష్యం కావాలి : ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూరు జూలై 4 విజన్ ఆంధ్ర రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మానకొండూర్ సింగిల్ విండో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విండో చైర్మన్ గా నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి,కత్తెర్ల రాజు,మంగురపు నర్సవ్వ,సుధగోని తిరుపతిగౌడ్, గాలి మొగిలి,కొట్టె అంజిరెడ్డి, ఎం.రామకృష్ణ,దూలం దేవేంద్ర, కొలిపాక మొగిలి, బుర్ర శ్రీకాంత్, కుర్ర వెంకటస్వామి, ఏగోళపు శ్రీనివాస్ గౌడ్ ల చేత జిల్లా సహకార శాఖ సీనియర్ రిజిస్ట్రార్ శైలజ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతన్నలకు అండగా నిలవాలని, సింగిల్ విండో వ్యవస్థ ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, పంటల బీమా వంటి సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తున్నదని, రైతు భరోసా కింద ఎకరానికి ఏటా రూ. 12,000 పెట్టుబడి సాయం, రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేస్తున్నదని, అర్హులైన ప్రతి రైతుకూ అందేలా సింగిల్ విండోలు కీలక పాత్ర



పోషించాలన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతికి తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా పని చేయాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి,పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీధర్,ఇర్ఫాన్, కోంద్ర సురేష్, కొత్తకొండ శంకర్, సాయిరి దేవయ్య, గొల్లెన కొమురయ్య, తమిశెట్టి రాజేశ్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం



హైదరాబాద్, జూలై 04 (విజన్ ఆంధ్ర) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడు యెల్ల శ్రీనివాస్ గంగపుత్ర కుటుంబానికి గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం, సహాయనిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. దుబాయ్ నుంచి ఇటీవల సెలవులపై వచ్చిన శ్రీనివాస్ ప్రమాదంలో మరణించడంతో ఆయన భార్యకు సంఘం ప్రతినిధులు నగదు అందజేసి పరామర్శించారు. గల్ఫ్ దేశాల్లో, స్వదేశంలో ఉన్న కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా సంఘం అండగా ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయనిధి ఫౌండేషన్ అధ్యక్షుడు తోకల శంకర్, మాజీ అధ్యక్షుడు సముద్రాల తిరుపతి, తెలంగాణ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మూల పవన్, రాష్ట్ర కన్వీనర్ గుమ్మల అంజయ్య, జగిత్యాల జిల్లా చైర్మన్ కల్లెడ నరసింహరాజు, తోకల పెద్ద నరసయ్య, తోకల లచ్చయ్య, దేశవేని మురళీధర్, పల్లికొండ శ్రీనివాస్, ఆర్మూరి గంగాధర్, కోరుట్ల చంద్రయ్య, ఎల్లా చిన్న నరసయ్య, ఎల్లా దశరథం, సంఘ ఉపాధ్యక్షుడు బింగి రాజు గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగ నరసన్న గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల నరేష్, కార్యదర్శి బింగి నరసయ్య, సహాయ కార్యదర్శి కొండూరు శ్రీనివాస్, ఫైనాన్స్ కంట్రోలర్లు మేడి రమేష్, నెన్నల రాజేష్, కోశాధికారి బోరి కిషన్, బింగి పోచన్న, కొంద్ర నారాయణ, బోరే ఇందయ్య, గౌరవ సలహాదారులు పుట్టి రాజు గంగపుత్ర, ఉట్నూరి రాజనర్సయ్య, ఉట్నూరి కమలాకర్, పందిరి రాజన్న, మేడి మహేష్, గుమ్మల శ్రీనివాస్ తదితరులు సహకరించారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

### మాదాసు సంజీవ్ బీసీ యువజన సంఘం అధ్యక్షులు

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూలై 04..బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మదాసు సంజీవ్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో దొడ్డి కొమరయ్య , స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ , మాదాసు సంజీవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వారి వర్ధంతుల సాక్షిగా పాఠశాలలు , హాస్టల్లు దయనీయ స్థితిలో ఉన్నాయని కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు సకాలంలో విద్యార్థులకు అందజేయడంలో రాష్ట్ర విద్యాశాఖ తీవ్ర వైఫల్యం చెందిందని విమర్శించారు. అలాగే విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేక ఒక్కొక్క ఉపాధ్యాయుడు రెండు మూడు సబ్జెక్టులు బోధించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యార్థులకు తక్షణమే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని , మరుగుదొడ్లు శుభ్రపరిచి, డోర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు , జిల్లా ఉపాధ్యక్షులు గుడిసెల రమేష్ గౌడ్ దుప్పటి పల్లి మురళి, జిల్లా కార్యదర్శి వాయిల రాజ్ కుమార్, విద్యార్థి సంఘం అధ్యక్షులు నారోజు రాకేష్ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు దేవరకొండ సంతోషి లక్ష్మి , పోకల విజయ్ గంగిపల్లి సతీష్ కట్ట సంజీవ్ శంకర్

## దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

### -టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, జూలై :04( విజన్ ఆంధ్ర)తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి శనివారం నాడు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం దొడ్డి కొమరయ్య చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం, రైతుల ఆత్మగౌరవం కోసం ఆయన తన ప్రాణాలను అర్పించడం ఎంతో గొప్ప త్యాగమని కొనియాడారు. దొడ్డి కొమరయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారి చూపిన ఉద్యమాలకు సాయుధ రైతాంగ పోరాటం బలమైన పునాదిగా నిలిచిందని, ఆ పోరాటంలో దొడ్డి కొమరయ్య చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను కాపాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చిద్రుప్ప రఘు గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, రాంరెడ్డి, కౌన్సిలర్లు రమేష్, శైలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి జిల్లాకు స్పష్టమైన లక్ష్యాలు.. ఆరు నెలల్లో గణనీయ మార్పే లక్ష్యం

### యూరియా సరఫరా,ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి
### సీజనల్ వ్యాధుల నివారణకు డ్రైడే తప్పనిసరి
### తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు
### మధ్యాహ్న భోజనం,అల్పాహార పథకాల నాణ్యతపై పర్యవేక్షణ
### సీఎస్ సంజయ్ జాజు




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-04(విజన్ ఆంధ్ర)రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.వ్యవసాయం, వర్షపాతం, ఆరోగ్యం, తాగునీరు, విద్య, సాగునీరు తదితర అంశాలపై సమీక్షించిన సీఎస్.. రైతులకు వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ సూచనలు ఎస్ఎంఎస్‌ల ద్వారా అందించాలని, యూరియా సరఫరా, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు డ్రైడే, యాంటీ లార్వా కార్యక్రమాలు, గర్భిణుల పర్యవేక్షణ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పైప్‌లైన్ లీకేజీల నివారణ, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఎదీ+=వావీ+ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నాణ్యతను కచ్చితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమష్టి కృషితో వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు సాధించవచ్చని సీఎస్ పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కల్పన, రెవెన్యూ డివిజనల్ అధికారులు గంగయ్య, సురేష్, ఇన్‌ట్రా ఈఈ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీసీ గురుకులాల్లో అతిథి ఉపాధ్యాయుల నియామకం

### జూలై 8న ఇంటర్వ్యూలు,డెమో నిర్వహణ
### కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ అంజలి

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-04(విజన్ ఆంధ్ర)ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు, డెమో తరగతులు నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే ఎడ్యుకేషనల్ సొసైటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నియామకాల ద్వారా పీజీటీ, టీజీటీ విభాగాల్లో ఇంగ్లీష్, బయో సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, సోషల్ స్టడీస్, జువాలజీ, కామర్స్, కెమిస్ట్రీ, సివిక్స్, బోటనీ, ఎకనామిక్స్, బీఎస్సీ నర్సింగ్ తదితర సబ్జెక్టులకు అతిథి ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఎడ్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఈ నియామకాలకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు జూలై 8వ తేదీ ఉదయం 10 గంటలకు తిమ్మాపూర్ మండలం ఎల్ఎమ్‌డీ కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలు, డెమోలకు అవసరమైన విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరుకావాలని రీజినల్ కోఆర్డినేటర్ అంజలి సూచించారు.

# నిరుపేద కుటుంబం నుండి ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ గా గోపు మహేష్



జూలూరుపాడు జులై 5 (విజన్ ఆంధ్ర ) జూలూరుపాడు మండలం బేతళ పాడు గ్రామానికి చెందిన గోపు మహేష్ ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ ఉద్యోగం సంపాదించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరుపేద కుటుంబం నుంచి ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ ఉద్యోగం సంపాదించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ గోవు మహేష్ మంచి వ్యక్తిత్వం కలిగిన విద్యార్థిగా చూసాము, మహేష్ పట్టుదల గ్రామంలో అనేకమందికి మార్గదర్శకం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు మహేష్ ఉద్యోగ రీత్యమరెన్నో పై స్థాయిలోకి వెళ్లాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చౌడం లక్ష్మీనారాయణ యువజన కాంగ్రెస్ నాయకులు బొడ్డు మల్లికార్జున్ బట్టు విజయరాజు కాంగ్రెస్ కార్యకర్తలు చౌడం నరేష్ పాల్గొన్నారు. **విజన్ ఆంధ్ర :- నీ పట్టుదలకు కారణాలు ఏమిటి?**మహేష్ అమ్మ నాన్న రామయ్య ఉదయశ్రీ , రోజువారి కూలీలకు వెళ్లి పూట గడిపే నిరుపేద రైతు కూలీ ప్రతి రోజు రైతు వారి వ్యవసాయ కూలికి పోయి జీవనం సాగించే వారు. వారి ఆర్థిక పరిస్థితులు కష్టాలు పిల్లకు రాకూడదు అని, ప్రత్యేక శ్రద్ద చూపి చదువు పట్ల అవగాహనా తెలుపుతూ పెంచారు. గోపి తన పదివ తరగతి పూర్తి చేసి కూలీ నాలి పనులలో మా నాన్నకి తోడుగా వుంటూ ఇంటర్ డిగ్రీ పూర్తి చేస్తూ తను ప్రతి శనివారం హైదరాబాద్ నుండి కొత్తగూడెం సంతకు రైలు ప్రయాణం చేసి నాన్న తో వీధి వ్యాపారం చేసి సంపాదించిన డబ్బుతో తన తమ్ముడు చదులు తన చదుల ఖర్చు చేస్తూ జీవనం సాగించే వాడు నా కోసం తన కష్టాన్ని త్యాగం చేస్తూ తన ఉద్యోగం సంపాదించి అమ్మ నాన్న లకు గ్రామానికి గొప్ప పేరు తేవాలని చెప్పేవాడు అని మహేష్ తన ఆవేదన వెక్తం చేస్తూ అమ్మ నాన్న కష్టాలు చూసి అన్నయ్య త్యాగం అందదండలే నన్ను ముందుకు నడిపాయి. అని ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ ఉద్యోగానికి సెలెక్ట్ అయిన మహేష్ అన్నారు తమ తల్లిదండ్రులకు అన్నకు ఉద్యోగం రావడానికి ప్రత్యేకంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# పెద్దపల్లిలో జూలై 8న జాబ్ మేళా



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-04(విజన్ ఆంధ్ర)పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జూలై 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తు, రూమ్ నెం. 233లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 67 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిలో 60 సేల్స్ ఎగ్జిక్యూటివ్, 4 ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, 2 హెచ్‌ఆర్, ఒక ఆఫీస్ బాయ్ పోస్టు ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులు పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది.సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా డిప్లొమా, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు బీఎస్సీ గ్రికల్చర్, హెచ్‌ఆర్ పోస్టులకు ఎంబీఏ (మార్కెటింగ్) లేదా హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు. ఆఫీస్ బాయ్ పోస్టుకు పదో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.ఆసక్తి గల అభ్యర్థులు అప్‌డేటెడ్ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ పత్రాలు (ఉన్నట్లయితే) వెంట తీసుకుని జూలై 8న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సూచించారు.మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# జులై 7 న సీత్ల పండుగను అందరం ఒకే రోజున జరుపుకుందాం

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జులై 4 (విజన్ ఆంధ్ర):ఈరోజు మానుకోట కార్తీక్ హాస్పిటల్ లో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోతు నందులాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ నెహ్రూ రాథోడ్ సేవా లాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సేవాలాల్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ బంజారాల సాంప్రదాయ పండుగ సీత్ల పండుగను జులై 7న పెద్ద పూసల కార్తె మొదటి మంగళవారం అందరూ ఒకే రోజున నిర్వహించాలని, జాతి ఐక్యతను చాటాలని అన్నారు. ప్రాచీన కాలం నుండి పశుసంపద బాగుండాలని పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని బంజారాలుసాంప్రదాయంగా నిర్వహించే మొదటి పండుగ సీత్ల పండుగ అని, ఈ పండుగను ప్రభుత్వం గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలని అలాగే ప్రజాప్రతినిధులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పండుగకు ప్రత్యేక గుర్తింపు తేవాలని అన్నారు. ప్రతి తండాలో సాంప్రదాయపదంగా ఘనంగా పండుగ నిర్వహించాలని స్థానిక తండా సర్పంచులు,తండా నాయకులు పండుగ గొప్పతనాన్ని అందరికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవల జాతీయ నాయకులు ధారవత్ మోతీలాల్ నాయక్,రాష్ట్ర అధికార ప్రతినిధి మాలోత్ సురేష్ నాయక్,జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబు నాయక్,మానుకోట మండల అధ్యక్షులు బోడ రమేష్ నాయక్, బానోత్ వెన్నెల బాయి పాల్గొన్నారు

# రేపు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్న కేటీఆర్

భూపాలపల్లి జిల్లా:4 జులై (విజన్ ఆంధ్ర) కన్నేపల్లి పంప్ హౌజ్ మోటార్లు ఆన్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రేపు కన్నేపల్లి పంపు హౌజ్‌ను పరిశీలించనున్న కేటీఆర్. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంపు హౌజ్‌ను పరిశీలించేందుకు రేపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ బృందం వెళ్లనుంది మంథని నియోజకవర్గంలోని కన్నేపల్లి పంప్ హౌజ్ వద్ద వృధాగా పోతున్న జలాలను బీఆర్ఎస్ బృందం పరిశీలించనుందిఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం వల్ల గోదావరి బేసిన్‌లో కేవలం 23% మాత్రమే నిండి ఉన్న రిజర్వాయర్లు.ప్రస్తుతం మేడిగడ్డ బరాజ్ దగ్గర గోదావరిలో 15 వేల క్యూసెక్కులు దాటి ప్రవాహం నమోదవుతున్నది.. రానున్న రోజుల్లో ప్రవాహాలు 60 వేల క్యూసెక్కులకు పైగా పెరిగే అవకాశం ఉంది.ఇలాంటి తరుణంలో మేడిగడ్డ బరాజ్‌పై ఆధారపడకుండా, కన్నేపల్లి (లక్ష్మీ) పంప్ హౌజ్ దగ్గర నీటిని మళ్లించి, పంపింగ్ చేపట్టే అవకాశం ఉన్నదని అభిప్రాయపడుతున్న నిపుణులు.కన్నేపల్లి పంప్ హౌజ్ మోటార్లు ఆన్ చేస్తే గోదావరిలో ప్రస్తుతం లభిస్తున్న ప్రవాహాన్ని వాడుకొని వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు నీరు అందించే మార్గం ఉందని పేర్కొంటున్న ఇంజనీర్లు.కన్నేపల్లి మోటార్లు ఆన్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే రేపు కన్నేపల్లి పంప్ హౌజ్‌ను పరిశీలించనున్న కేటీఆర్.

# మున్సిపాలిటీ నుండి బోరు బావిపై మోటర్ ను మంజూరు చేయించిన 26వ వార్డు కౌన్సిలర్ మాలోత్ శ్రీదేవి బాలునాయక్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 4 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని26వ వార్డు, సిగ్నల్ కాలనీ, గుట్ట కింద వైపు, కొన్ని సంవత్సరాలుగా నీళ్ల సమస్య ఉండేది. అట్టి సమస్య మా దృష్టికి వచ్చి, ఎలక్షన్ కంటే ముందు, మేము మా సొంత ఖర్చులతో రెండు బోర్లను వేయించడం జరిగింది. ఒకటి ఫెయిల్ అవ్వగా, ఇంకొక బోరు బానోతు లింగ్యా గా/శీ తేజ్య ఇంటి వెనకాల నీళ్ళు రావడం జరిగింది ఈ రోజు అ బోర్ పై మోటర్ ను బిగించడం జరిగింది. మేము, కాలనీ ప్రజల యొక్క నీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని, మేము సొంతంగా బోర్ వేయించిన, బోర్ మీద మోటర్ ని మాత్రం మున్సిపాలిటీ తరఫున పెట్టించడం జరిగింది. బోరు మీద నూతన మోటర్ ని మంజూరు చేసిన కమిషనర్ వినోద్ కు చైర్మన్ జ్యోతి రమేష్ కి, ఇ.జు ఉపేందర్ కి కౌన్సిల్ లో సహకరించిన కౌన్సిలర్లకు ఫ్లోర్ లీడర్లకు, మోటారు బిగించడానికి వచ్చిన కుమారస్వామి & టీం కు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపిన



వార్డు కౌన్సిలర్ మాలోత్ శ్రీదేవి బాలు నాయక్ చుక్క శ్యాం ప్రసాద్, సూర్నెని రాము, మాలోత్ నాగరాజు, పోడకంటి వెంకటేష్, తేలూరి రమేష్, అనిల్, సునీల్, రాము, మహేష్, రాజకుమార్, భద్ర, నాగ, సైదులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

### ప్రభుత్వ పాఠశాలల్లో వార్షిక విద్యా ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలి
### కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-04(విజన్ ఆంధ్ర)జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఈ విద్యా సంవత్సరంలో కూడా పటిష్టమైన కార్యాచరణను అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించిన ప్రాథమిక ఉపాధ్యాయుల డీఆర్‌పీ బృందం సమీక్ష సమావేశంలో ఆయన వార్షిక విద్యా ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు.గత విద్యా సంవత్సరంలో సాధించిన ఫలితాలను కొనసాగిస్తూ, ప్రాథమిక స్థాయి విద్యార్థుల తరగతి వారీ అభ్యాస సామర్థ్యాలను మరింత మెరుగుపరిచే దిశగా రూపొందించిన కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంతో పాటు, పాఠశాల స్థాయి సమీక్షలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమం సమర్థంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.ప్రతి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థుల నమోదు అధికంగా ఉన్న ఐదు ప్రాథమిక పాఠశాలలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను ప్రతి నెల సమీక్షించి, అవసరమైన మెరుగుదల చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, విద్యా ప్రమాణాల పెంపు, సమర్థవంతమైన బోధన, అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రూపొందించిన వార్షిక విద్యా ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థి అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి శారద, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) షేక్, అలోకిట్ పర్యవేక్షకులు, ప్రాథమిక స్థాయి డీఆర్‌పీ బృందం పాల్గొన్నారు.

# మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శంజిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-04(విజన్ ఆంధ్ర)మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి అన్నారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి , కొణిజెటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.దొడ్డి కొమురయ్య, కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని , ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. కొణిజెటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తోపాటు రోడ్లు భవనాలు రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్ వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రి గా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారని తెలిపారు.మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి సురేష్ , ఎస్సీ సంక్షేమ అధికారి ఎం. రవీందర్ మైనారిటీ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దోమకొండలో ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



కామారెడ్డి బ్యూరో జులై 4 (విజన్ఆంధ్ర)తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి వేడుకలు దోమకొండ లో ఘనంగా నిర్వహించారు. కుర్మ సంఘ అధ్యక్షులు నాయకులు, గ్రామ సర్పంచ్,మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ నాయకులు దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరంతెలంగాణ చరిత్రలో ఎల్లకాలం నిలిచిపోయే పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని తన అమరత్వంతో మలుపుతిప్పిన ధీరుడు కొమురయ్య తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించి ప్రభుత్వం గౌరవించుకుంది.దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించేలా మనమందరం పాటుపడాలని సర్పంచి ఐరన్ నరసయ్య, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘ అధ్యక్షులు బుచమొల్ల నర్సింలు. నాగ నాగరాజు.గుణోళ్ల కొమురయ్యపెదోల్ల సాయిలుఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్, చేనేత పరిశ్రమ అధ్యక్షులు బత్తిని సిద్ధ రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు,వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, నాగారపు ఎల్లయ్య, బొబ్బ సైని సుధాకర్, నేతుల మల్లేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్ , నేతుల సుధాకర్, అబ్రబోయిన రాజేందర్, రాజు, కుర్మ సంఘ కుల సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# గొట్టిముక్కల పోచమ్మ ఉత్సవాలలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్

కామారెడ్డి బ్యూరో జులై 4 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో అంబేద్కర్ సంఘము ఆధ్వర్యంలో ప్రతిష్టాపన చేసిన పోచమ్మ ఉత్సవాలలో మాజీ జెడ్పిటిసి తీగల తీర్మాలు గౌడ్ శనివారం పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాజీ జెడ్పిటిసిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దోమకొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, నత్తి సంజీవ్, లింగం, భూమయ్య, స్వామి, రాములు, సంతోష్ రెడ్డి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు



సూర్యాపేట జూలై 04:(విజన్ ఆంధ్ర)బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన వంగవీటి మోహనరంగా యువతకు ఆదర్శప్రాయమైన నాయకుడని మున్నూరు కాపు తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ దంతాల భరత్ నాయుడు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా మున్నూరు కాపు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వంగవీటి మోహనరంగా కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకుడు మాత్రమే కాదని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. అతి చిన్న వయసులోనే రాజకీయంగా విశేష గుర్తింపు తెచ్చుకున్న నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గతంలో వంగవీటి మోహనరంగా సూర్యాపేటతో మంచి అనుబంధం కలిగి ఉన్నారని, మాజీ మున్సిపల్ చైర్మన్ మీలా సత్యనారాయణ గెలుపులో కూడా ఆయన ప్రోత్సాహం ఉందని గుర్తు చేశారు. సూర్యాపేటలో ఆయన జయంతి వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందని, ఇకపై ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవి రావు, వెన్న ఉపేందర్ నాయుడు, ఎలిమినేటి రమేష్, పిల్లల రమేష్ నాయుడు, ఎలిమినేటి అభినయ్, నరేందర్ నాయుడు, దంతాల సందీప్ నాయుడు, చెంచల నిఖిల్ నాయుడు, దంతాల నవీన్, ప్రేమ్ నాయుడు,రౌతు కళ్యాణ్, సతీష్, బండారు మధు నాయుడు,బండారు సతీష్,ఎడబోయిన పవన్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని అదృశ్యం

మల్కాజిగిరి, జూలై 4,(విజన్ ఆంధ్ర): కళాశాలకు వెళ్లిన ఓ విద్యార్థినీ అదృశ్యమైన సంఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసు లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేరేడ్మెట్ శివానగర్ కాలనీకి చెందిన కీర్తి శ్రీనివాస్ టైలర్. ఈయన కుమార్తె కీర్తి స్నేహిత (19) రాధిక సమీపంలోని ఒమేగా డిగ్రీ కాలేజీలో డిగ్రీ 3వ సంవత్సరం చదువుతోంది. ఆమె ప్రతి రోజులాగే శనివారం ఉదయం 8.30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి, కళాశాలకు వెళ్లింది. సాధారణంగా మధ్యాహ్నం 2:30 గంటలకు ఇంటికి వస్తుంది. అయితే ఈరోజు సాయంత్రం 7:00 గంటలైనా తను ఇంటికి రాలేదు.ఆమె ఆచూకీ కోసం అన్ని చోట్ల వెతికారు. ఆమె స్నేహితులకు, మా బంధువులకు ఫోన్ చేసి విచారించినా ఫలితం లేక పోయింది. దీంతో ఆమె తండ్రి నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# బోడుప్పల్ సర్కిల్‌లో ఎఫ్‌టీఎల్ భూములపై అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

## చెరువులు,కుంటలు మాయమవుతున్న కనిపించని ఇరిగేషన్ అధికారులు
## అక్రమ కట్టడాలను కూల్చి నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి
## బోడుప్పల్ అఖిలపక్షం అధ్యక్షుడు ఎల్లగొని బాలరాజు గౌడ్



బోడుప్పల్,జులై04(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్లు 158, 196, 197లో 600 గజాల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బోడుప్పల్ అఖిలపక్షం అధ్యక్షుడు ఎల్లగొని బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం ఆద్వర్యంలో శనివారం కబ్జాకు గురైన స్థలాన్ని సందర్శించి అక్రమాలను గుర్తించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూచెరువులు, కుంటలు ఆక్రమణలకు గురై రోజురోజుకు కనుమరుగవుతున్నా, వాటిని పరిరక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో కనిపించకుండా ఉండటం దురదృష్టకరమని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఆక్రమణదారులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. సర్వే నంబర్లు 158, 196, 197లో 600గజాల స్థలంపై గత ప్రభుత్వ హయంలో ఎఫ్‌టీఎల్ కు వస్తుందని గుర్తించిన అధికారులు ఎలాంటి నిర్మాణాలు జరుగకుండా చూశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఎఫ్‌టీఎల్ లో జరుగుతున్న నిర్మాణాలపై వెంటనే సమగ్ర విచారణ నిర్వహించి, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణదారులతో పాటు తమ విధులను నిర్వర్తించని అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ అధికారులు ఇకనైనా మౌనం వీడి వెంటనే చర్యలు చేపట్టాలని, లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పరిశీలించిన వారిలో కామగళ్ల నర్సింహ్మా,రాపోలు శంకరయ్య,బద్దుల సత్యనారాయణ యాదవ్, ఎనుగు లక్ష్మయ్య,సాయిని అమృతం,చీరాల జంగయ్య,రాపోలు రామస్వామి,తూర్పాటి యాదయ్య,తలారి కృష్ణ,బోడగళ్ల సదానంద్,తదితరులు పాల్గొన్నారు.

# రమేష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన వెలుగు వెంకన్న



సూర్యాపేట జూలై 04:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా వెలుగు వెంకన్న శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి వెలుగు వెంకన్న ని శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నేరెళ్ళ మధు, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ , మేగ్య తండా సర్పంచ్ రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్దాస్ దేవేందర్, చిలుముల గోపాల్ రెడ్డి, యాట ఉపేందర్, పానుగంటి మల్లారెడ్డి, దారవత్ ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఆడిషనల్ ఎస్పీ.




భూపాలపల్లి జిల్లా : 4 జూలై (విజన్ ఆంధ్ర) కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఆడిషనల్ ఎస్పీ. జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, శనివారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య80 వర్ధంతి

## దొడ్డి కొమురయ్య ఆశయ సిద్ధికై ఉద్యమిద్దాం
## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి




కాజీపేట జులై 04 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విసునూరు దేశముఖ్ దోపిడీ దౌర్జన్యాలు అఘాయిత్యాలకు వ్యతిరేకంగా నైజాం నవాబు దుర్మార్గాలకు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం ద్వారా మట్టిప్రజల్ని చైతన్యపరిచి సాయుధ పోరుకు సైరన్ ఊదిన సమయంలో 1946 జూలై 4న విసునూరు దొర గుండాలు కడవెండి గ్రామం పై కాల్పులు జరిపిన దానిలో 18 సంవత్సరాల యువకుడు దొడ్డి కొమరయ్య వీరమరణం పొందడం జరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి తెలిపారు. శనివారం మడికొండ చౌరస్తాలో కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య 80 వ వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నేదునూరి జ్యోతి,మద్దెల ఎల్లేష్,నేదునూరి రాజమౌళి హాజరై మాట్లాడుతూ ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేస్తూ గ్రామ రాజ్యాలను నిర్మిస్తూ భూములు పంచుతూ వెట్టి చాకిరిని నిరసిస్తూ తెలంగాణ సాయుధ పోరాటం దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిందని అన్నారు. దేశ చరిత్రలో దొడ్డి కొమురయ్య అమరత్వం నేటి ప్రజలకు ఎంతో ఆదర్శమని తెలిపారు. దొడ్డి కొమరయ్య అందించిన స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణ కొరకు రాజ్యాంగాన్ని కాపాడుటకు దళిత బహుజన రాజ్యం స్థాపనకు, మరో ప్రజాస్వామ్య పోరాటానికి, లౌకిక వామపక్ష ప్రజాస్వామ్య శక్తులు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం, జిల్లా కార్యవర్గ సభ్యులుమునిగాల బిక్ష పతి, నాయకులు బొట్టు బిక్షపతి, రాసమల్ల దీన, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, బరిగెల గురుస్వామి, భానోత్ మనేమ్మ, ప్రణీత పద్మ, మోడం రాజేందర్, రిల్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కృషి చేయాలి

## సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ




సూర్యాపేట సిటీ, జూలై 04:(విజన్ ఆంధ్ర)జిల్లాలోని పోలీస్ స్టేషన్ల నుండి కోర్టు విధుల పర్యవేక్షణ కోసం పనిచేస్తున్న కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బందికి ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు విధుల నిర్వహణకు సంబంధించి సలహాలు సూచనలు అందించారు, పనిలో నాణ్యత, పారదర్శకత ఉండాలని అని అన్నారు, పెండింగ్ ఉండకుండా పని చేయాలి, కోర్టు వారెంట్, సమన్ లు సకాలంలో అందజేయాలి, సిబ్బంది కోర్టులలో సమన్వయంగా, సమయపాలనతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు కేసుల స్థితిగతులను రికార్డులలో, అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. బాధితులను, సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టులకు ప్రవేశపెట్టి కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన నేరస్తులకు శిక్షలు అమలు అయితేనే క్షేత్రస్థాయిలో నేరాలను అదుపు చేయవచ్చు అని సూచించారు. లక్ష్యంతో పని చేయాలని కోర్టు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసుకోవాలని సూచించారు. ఈ సమావేశం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి రవి, ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కోర్టు డ్యూటీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ పూర్తి చేసిన యువతకు ధ్రువపత్రాల ప్రదానం ముగింపు సభలో పాల్గొన్న ఎమ్మెల్యే , జిల్లాకలెక్టర్.



భూపాలపల్లి జిల్లా :4 జూలై (విజన్ ఆంధ్ర) శనివారం రోజున సింగరేణి సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు నిర్వహించిన డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ విజయవంతంగా పూర్తికాగా, శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాల ప్రదానోత్సవం శనివారం భూపాలపల్లి ఏరియా జియం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై శిక్షణ పూర్తి చేసిన యువతకు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి ఆధునిక యుగంలో డ్రోన్ సాంకేతికతకు విశేష ప్రాధాన్యత ఏర్పడిందని, ఈ రంగంలో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను కూడా సృష్టించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతను భవిష్యత్తు అవసరాలకు సిద్ధం చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. డ్రోన్ సాంకేతికత భవిష్యత్తులో కీలక రంగంగా ఎదుగుతుందని, శిక్షణ పొందిన యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకుని తమ భవిష్యత్తును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. సింగరేణి భూపాలపల్లి ఏరియా జియం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో డ్రోన్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పరిశ్రమలు, గనులు, వ్యవసాయం, భద్రత, భూసర్వేలు, విపత్తుల నిర్వహణ వంటి అనేక రంగాల్లో డ్రోన్ల వినియోగం వేగంగా పెరుగుతోందని తెలిపారు. భవిష్యత్తులో డ్రోన్ సాంకేతిక నిపుణులకు మంచి డిమాండ్ ఉండబోతోందని, శిక్షణ పొందిన వారు తమ నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డ్రోన్ల నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక అంశాలు, భద్రతా ప్రమాణాలు, ప్రాయోగిక శిక్షణ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను విస్తరించడమే సింగరేణి సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బుర్ర కొమురయ్య , వైస్ చైర్మెన్ అంబాల శ్రీనివాస్, ఏజీఎం (ఐ ఈ డీ ) , డిజిఎం క్వాలిటీ కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్ , ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, విటిసి మేనేజర్ నజీర్, డ్రోన్ శిక్షణ నిపుణులు సందీప్, సింగరేణి అధికారులు, ప్రాంతీయ నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సంచాలక కార్యాలయ ప్రతినిధులు, శిక్షణ పొందిన అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత ముందుకు రావాలి

## తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపినాయక్



ఎల్బీనగర్ జులై 04 (విజన్ ఆంధ్ర): తెలంగాణ గిరిజన సంఘం ఆద్వర్యంలో చిత్ర లేవుట్ కమాన్ దగ్గర తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపినాయక్ అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పుల్లమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజుపోరాట స్ఫూర్తితో యువతీ యువకులు ముందుకు వచ్చి సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు చదువుకొని ఉద్యోగం ఉపాధి అవకాశాలు రాక ఆర్థిక భారంతో జీవించలేని యువకులు అనేక మంది అసాంఘిక కార్యక్రమాలు చేస్తూ సమాజను భయభ్రాంతులకు గురించి చేసే విధంగా ఉంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ఎన్నికలో ఇచ్చే హామీలు నెరవేర్చాలని, యువతీ యువకులను ఉద్యోగాలు ఇచ్చి ఎన్నికలో ఇచ్చిన వాగ్దానాలు నిలుపుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలకు గోపి నాయక్ డిమైండ్ చేశారు. ఉద్యోగం లేని యువతీ యువకులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం యువతీ యువకులకు మోసాగించారాని మండిపడ్డారు. రాష్ట్రములో ఖాళీగా ఉద్యోగాలు భర్తీ చేయాలి, నిరుద్యోగ భృతి కల్పించాలని, లేనిది యెడల ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడి స్తామని హెచ్చరించారు. యల్ బి నగర్, సరూర్ నగర్, హయత్ నగర్, ప్రాంతంలో ఉన్న నీరు పేద లంబాడి గిరిజనులకు ఇండ్లు ఇండ్లస్థలాలు ఇవ్వాలని, వికలాంగులకు, వింతంతు, వృద్ధాప్య పిన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె శ్రీహరినాయక్, యం శివనాయక్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు “దొడ్డి కొమురయ్య కురుమ‘



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ జూలై 4 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ పోరాట పటిమ దేశానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 80వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రం సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భూమి కోసం భుక్తి కోసం పెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విసునూరి దొర రామచంద్రారెడ్డి ఆగడాల వ్యతిరేకించినందున దొర గుండాల కాల్పుల్లో వీర మరణం పొందినారన్నారు. నాటి తొలి అమరత్వం తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిందని, ఎర్రజెండాలతో బరిసెలతో దొరలను ఎదిరించిన వీరులు ఎందరో అమరులయ్యారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. నిజాం రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనమైందని అన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు పాత్ర మరువలేనిదని, నేడు వచ్చిన తెలంగాణలో సామాజిక న్యాయం ఆర్థిక సమానత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఓట్లు తొలగిస్తున్నారని, ఇందులో బిజెపి కుట్ర దాగి ఉందని, నిష్పక్షపాతంగా అధికారులు వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండే విధంగా కృషి చేయాలని, లేనియెడల మరో పోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గుడిసె వాసులకు న్యాయం చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6 తారీఖున ఇందిరా పార్క్ లో జరిగే వామపక్షాల మహా ధర్నా లో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మెట్టు శాఖ కార్యదర్శి వర్క్య రమేష్, మహిళా సమైక్య నాయకులు చందన, అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామ పంచాయతీ 13వ వార్డు సభ్యురాలు కేతరాజు మంజుల, బిక్షపతి, నాగేశ్వరరావు, సుల్తాన్, నరసయ్య, ఎనుగోటి లక్ష్మిప్రియా, పేరాల లక్ష్మి, వాసిరెడ్డి లక్ష్మి, లలిత, వైశాలి, మానెమ్మ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్పపీడనం ఎఫెక్ట్.. నేటి నుంచి భారీ వర్షాలు

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 4 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ, ఏపీ ప్రజలకు బిగ్ అలర్ట్. నేటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాలలో భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. బిఈ రెండు తెలుగు రాష్ట్రాలపై అల్పపీడన ప్రభావం స్పష్టంగా ఉన్నట్లు వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా మారనున్నట్లు పేర్కొంది. దీని కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, అదిలాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట లాంటి జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అల్పపీడనం ప్రభావంతో నేడు అల్లురి, ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం,మన్యం,అల్లూరి, పోలవరం,పల్నాడు జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు, మిగతా చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏ పి ఎస్ డి ఎం ఏ, ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం వెంబడి గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మన్యం వీరుడికి నివాళులు అర్పించిన దొడ్ల వెంకటేష్ గౌడ్

మల్కాజ్గిరి జిల్లా జూలై 4 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామారాజు జయంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , ఉషాముళ్ళపూడి కామన్ వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనను ధిక్కరించి, గిరిజనుల హక్కుల కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించి గౌరవించడం మనందరి బాధ్యత అని అన్నారు. అడవులపై గిరిజనులకున్న హక్కులను కాలరాస్తున్న బ్రిటిష్ వారి అణచివేత, అటవీ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రంప (మన్యం) తిరుగుబాటుకు ఆయన నాయకత్వం వహించారని గుర్తు చేశారు. కేవలం 27 ఏళ్ల చిన్న వయసులోనే దేశం కోసం, గిరిజనుల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. అల్లూరి దేశభక్తి, తెగువ నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని ఆశయ సాధన, ఆ మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ సమగ్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, గోపాల్, జి.రవి, రాజేష్ చంద్ర, రామరాజు, రఘు, శ్రీధర్, సంగమేష్, లింగం, సత్తయ్య, జీవన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, యాదగిరి, మహేష్, ఖలీమ్, రవీందర్, శివ, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కౌటాల మండల కేంద్రంలో SIR -2026 అవగాహన సహాయ కేంద్రం




కాగజ్ నగర్ జులై 4(విజన్ ఆంధ్ర) కొమురం భీం జిల్లా కౌటాల మండల కేంద్రంలో ూ×=-2026 కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ (ణజజ) అధ్యక్షులు ఆత్రం సుగుణ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాలు), పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సహాయ కేంద్రం ద్వారా ఓటరు నమోదు, ఓటరు జాబితాలో పేరు చేర్పు, తొలగింపు, చిరునామా మార్పు, వ్యక్తిగత వివరాల సవరణ వంటి అంశాలపై ప్రజలకు పూర్తి సమాచారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఆత్రం సుగుణ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ఎవరైనా ఓటరు జాబితాలో పేరు లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని, వివరాల్లో పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని సూచించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, ూ×=-2026 కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా సహాయ కేంద్రంలో నివృత్తి చేసుకోవచ్చని నాయకులు వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఓటర్లకు నమోదు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం, సవరణల ప్రక్రియపై వివరంగా అవగాహన కల్పించారు.ప్రజలు పెద్ద సంఖ్యలో సహాయ కేంద్రాన్ని సందర్శించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాలు), కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాల లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 4.( విజన్ ఆంధ్ర)కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు పెంచికల్పేట్ కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాబృంద సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాల్యవివాహాల ముప్పులు, రోడ్డు ప్రమాదాలు నివారణ, చట్టం-శాంతి భద్రత, మహిళల భద్రత, గుడ్ టచ్ ▪ బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు (1930, 100, 1098) వినియోగం వంటి ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కవిత, పాఠశాల బృందం, కళబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, స్థానిక పోలీస్ కానిస్టేబుల్ రాజేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.
జిల్లా పోలీస్ కళాబృందం ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతలో సమాజహితం, చట్టం-శాంతి, భద్రత, జాగ్రత్తలు వంటి విషయాల్లో మరింత అవగాహన పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.

# విత్తనాలు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 4 .(విజన్ ఆంధ్ర) రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ లో రైతులకు పంటలు సాగు చేసుకోవడానికి అవసరం గల విత్తనాలు ఎరువులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు శనివారం రాష్ట్ర సచివాలయం నుండి సంబంధిత శాఖల కార్యదర్శి తో కలిసి వ్యవసాయ నీటిపారుదల త్రాగునీటి వైద్యం విద్యాశాఖ వాతావరణ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో పంటల సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు ఎరువులు పక్క దారి పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు రత్నామ్యాయ పంటలు సాగు పై రైతులు ముగ్గు చూపేలా అవగాహన చేపట్టాలన్నారు ప్రత్యామ్నాయ పంటల పైన కంది జొన్న ఉద్యానవన పంటలు ఆయిల్ ఫామ్ కూరగాయల సాగు వైపు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు నానో ఎరువుల వాడకం పై రైతులకు రాష్ట్రంలో వర్షాకాల సీజన్లో డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్యశాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు గ్రామాలలో మునిసిపాలిటీలో పాఠశాలలు వసతి గృహాలు గురుకులాలు ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆరోగ్యం పై దృష్టి సారించాలన్నారు మిషన్ భగీరథ శాఖ అధికారులు వర్షాకాలంలో కలుషిత నీరు కాకుండా శుద్ధ జలాన్ని అందించాలన్నారు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం మధ్యాహ్న భోజనం కళాశాలలో విద్యార్థులకు అందించనున్న మధ్యాహ్న భోజనం పై పర్యవేక్షించాలన్నారు





కలెక్టర్లు తమ జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటన చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు పర్యాటక ప్రదేశాలు గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు భూసేకరణ వేగవంతం చేయాలన్నారు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు సమీకృత కలెక్టరేట్ భవన లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఎల్వి యువరాజ్ మరమత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు జిల్లాలో వరి పంటలకు అవసరమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఇప్పటివరకు 71% పూర్తయిందని 100% అయ్యేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు వర్షాకాలంలో డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా టైఫాయిడ్ వ్యాధులను అరికట్టాలన్నారు గ్రామంలో పారిశుద్ధ్య క్రమం తప్పకుండా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎమ్. డేవిడ్ ,కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల ,డిఆర్ఓ దాసరి వేణు, డీఎంహెచ్వో సీతారాం, డి ఏ ఓ వెంకటి ,ఎస్ ఈ .మిషన్ భగీరథ సిద్ధిక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్కీ డ్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### రూ.999తో భూమి సొంతం అవుతుందా? ఇలాంటి మోసపూరిత ప్రచారాలను అస్సలు నమ్మద్దు
### అక్రమ లక్కీ డ్రా నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు లక్కీ డ్రా బుక్కులు, సెల్‌ఫోన్ స్వాధీనం

కామారెడ్డి బ్యూరో జులై 4(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా సదాశివనగర్ గ్రామానికి చెందిన సింగరాయపల్లి రమేష్ (34), తండ్రి బాలయ్య తనకు చెందిన సర్వే నెం.108/1/2లో ఉన్న 19 గుంటల పట్టా భూమిని లక్కీ డ్రా ద్వారా విక్రయిస్తానంటూ సోషల్ మీడియా గ్రామంలో ప్రచారం నిర్వహిస్తూ, ఒక్కో వ్యక్తి నుంచి రూ.999 చొప్పున వసూలు చేసి రసీదులు జారీ చేస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం సదాశివనగర్ పోలీసులకు అందిందని,సమాచారం అందుకున్న వెంటనే సదాశివనగర్ ఎస్సై పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే లక్కీ డ్రా స్కీం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అనుమతులకు సంబంధించిన పత్రాలు చూపించాలని కోరగా, సంబంధిత వ్యక్తి తన వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని అంగీకరించాడు.దీంతో లక్కీ డ్రాకు సంబంధించిన 6 బుక్కులు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలను ఆకర్షించే పేర్లతో నిర్వహించే అనుమతి లేని లక్కీ డ్రాలు, పెట్టుబడి పథకాలు, బహుమతి స్కీములు ఇతర మోసపూరిత కార్యక్రమాలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని తెలిపారు.“రూ.999 కట్టి లక్షల విలువైన భూమి వస్తుంది“, “చిన్న పెట్టుబడితో భారీ లాభాలు“, “లక్కీ డ్రాలో ఖచ్చితంగా బహుమతి“ వంటి ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఇలాంటి స్కీముల వెనుక మోసం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, డబ్బు చెల్లించే ముందు తప్పనిసరిగా సంబంధిత ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించుకోవాలని



సూచించారు.అమాయక ప్రజలను లక్కీ డ్రాలు, స్కీములు లేదా ఇతర మోసపూరిత పథకాల పేరుతో మోసం చేసే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అలాగే, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహించే వారు మాత్రమే కాకుండా, తెలిసి వాటిలో భాగస్వామ్యం అయ్యే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.ప్రజలు తమ పరిసరాల్లో ఇలాంటి అక్రమ లక్కీ డ్రాలు, మోసపూరిత స్కీములు లేదా అనుమానాస్పద ఆర్థిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పి తెలిపారు

## తాడూరు మండల దివ్యాంగుల పరిరక్షణ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు నారందాస్ శ్రీశైలం



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 04తాడూరు మండలంలో జిల్లా దివ్యాంగుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు నరందాస్ శ్రీశైలం కార్యదర్శి మొల్గర పరశురాములు తెలిపారు. తాడూరు దివ్యాంగ మండల కమిటీ అధ్యక్షులుగా కొప్పునూరు సైదులు ప్రధాన కార్యదర్శిగా ఎండి.కమ్రా జమఖన్,కార్యదర్శిగా ఎండి. భూరన్,ఉపాధ్యక్షులుగా తిరుమందాస్ శివకుమార్ గౌడ్, ఎం.బాలాజీ,ప్రచార కార్యదర్శిగా భరత్ గౌరవ అధ్యక్షులుగా మేఘనాథ్ కార్యవర్గ సభ్యులు జయ శేఖర్,శివశంకర్,హుస్సేన్, పర్వతాలు,వెంకటయ్య, నాసిర్,సుదర్శన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాలలోని దివ్యాంగుల సమస్యలపై కమిటీ పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంతటి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహనరంగా 7 9వ జయంతి వేడుకలు

ఘనంగా వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు: మేడ్చల్




మల్కాజ్గిరి జిల్లా జూలై 4 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):మాజీ ఎమ్మెల్యే, ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా, ఈరోజు కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ సేవ, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కూకట్పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ,నాయకులు గంధం రాజు ,రంగమోహన్, కరుణాకర్, భరత్, అరవింద్ రెడ్డి, కిలారు శ్రీనివాస్ బాబు, రాజేష్ గౌడ్, నళిని కాంత్ ,బాలరాజు, రాము, నవీన్ , కామినేని వాసు,వనజ ,సుజాత, వాణి, అరుణ్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మోహనరంగా గారికి ఘన నివాళులు అర్పించారు.

# సైబర్ భద్రతపై విస్తృత అవగాహన

### వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 04 ( విజన్ ఆంధ్ర ) : మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా పోలీసులు కృషి చేస్తున్నారని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. “వికారాబాద్ సురక్ష మిత్ర“ కార్యక్రమం కింద నేటి నుండి 10.07.2026 వరకు మొదలైన “సైబర్ అవేర్నెస్స్ వీక్” లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, వి.పి.ఓ తమ తమ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించే పద్ధతులు, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, ఓటిపిలు, పాస్‌వర్డ్‌లు, పాఠశాల వివరాలు ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అదేవిధంగా సోషల్




మీడియాలో అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించకూడదని, ఫేక్ ప్రొఫైల్‌లు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ గేమింగ్ మోసాలు, ఫిషింగ్ లింకులు, బహుమతుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు.విద్యార్థులు ఏదైనా అనుమానాస్పద సందేశం, అవమానకరమైన పోస్టు లేదా సైబర్ వేధింపులను ఎదుర్కొంటే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ధృవీకరించకుండా ఇతరులకు ఫార్వర్డ్ చేయరాదని అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1098, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ - 112, ఙఙఙ.ఎఎవతీఎతీఅవ.స్త్రశీజ.అఅ ద్వారా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయవచ్చని విద్యార్థులకు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మై సైబర్ సేఫ్టీ ప్లెడ్జ్ చేయించి, తమ వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా వ్యవహరించడం, అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలను వెంటనే పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు సైబర్ భద్రతపై అవగాహన అత్యంత అవసరమని, ప్రతి విద్యార్థి సురక్షితమైన డిజిటల్ పౌరుడిగా ఎదగాలనే లక్ష్యంతో “వికారాబాద్ సురక్ష మిత్ర“ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై పర్యవేక్షణ వహించి సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించాలని కోరారు.వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, “సురక్ష మిత్ర“ “సైబర్ అవేర్నెస్స్ వీక్“ లో భాగంగా జిల్లా పాఠశాలలు, కేజీబీవీ కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత మరియు రోడ్డు నిబంధనలపై పోలీస్ అధికారులు విస్తృత అవగాహన కల్పించారు.

# రైతు భూమి అక్రమ నమోదు వ్యవహారంలో కలెక్టర్ కఠిన చర్యలు

**జీవించి ఉన్న రైతును మృతుడిగా చూపించి పట్టా భూమిని అసైన్డ్ భూమిగా నమోదు**
**భూభారతి ఆపరేటర్ మూడవత్ జైపాల్ తొలగింపు క్రిమినల్ కేసు నమోదు ..**
**డిప్యూటీ తహసీల్దార్ ఏ అశోక్ కుమార్ సస్పెన్షన్**
**విచారణలో తీవ్ర నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన వెలుగులోకి**

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 04 అచ్చంపేట మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన రైతు జంచుక మసన్న జీవించి ఉండగానే ఆయన మరణించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి, రైతుకు తెలియకుండానే ఆయన పట్టాదారు భూమిని ప్రభుత్వ అసైన్డ్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సీరియస్‌గా స్పందించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయి విచారణ చేపట్టించిన కలెక్టర్, విచారణలో వెలుగులోకి వచ్చిన వాస్తవాల ఆధారంగా బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.విచారణలో అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న మూడవత్ జైపాల్ విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలడంతో ఆయనను వెంటనే విధుల నుంచి తొలగించారు.అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.అదే సమయంలో ఘటన జరిగిన సమయంలో అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి, ప్రస్తుతం పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డిప్యుటేషన్)గా పనిచేస్తున్న ఎ. అశోక్ కుమార్ పై కూడా విచారణలో తీవ్ర నిర్లక్ష్యం నిర్ధారణ కావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ భూ-భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) రూల్స్ ▪ 2025 ప్రకారం వారసత్వ మార్పిడి (ూబఎఎవంంఅశీఅ వీబ-్ఘ్అశీఅ) కేసుల్లో దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, రిజిస్ట్రేషన్ చట్టం ▪ 1908 మరియు భూ-భారతి నిబంధనల ప్రకారం ధ్రువీకరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉంది. అయితే ఎ. అశోక్ కుమార్ సమర్పించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించకుండా, తగిన ధ్రువీకరణ లేకుండానే వారసత్వ మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా నిబంధనలనుఉల్లంఘించినట్లు విచారణలో తేలిందని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ నిర్లక్ష్యం కారణంగానే జీవించి ఉన్న రైతును మృతుడిగా చూపిస్తూ రికార్డుల్లో మార్పులు జరిగాయని, ఫలితంగా రైతు పట్టాదారు భూమి ప్రభుత్వ అసైన్డ్ భూమిగా నమోదై రైతు హక్కులకు తీవ్ర భంగం కలిగిందని విచారణలో వెల్లడైంది.ఈ నేపథ్యంలో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ మరియు అప్పీల్)నిబంధనలు ▪ 1991లోని రూల్ ▪ 8 ప్రకారం ఎ. అశోక్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ ఉత్తరంలో తెలిపారు.సస్పెన్షన్ కాలంలో ఆయనకు నిబంధనల ప్రకారం ప్రాథమిక వేతనం, అలవెన్సులలో 50 శాతం జీవనభృతి (Subsistence Allowance )చెల్లించనున్నట్లుఉత్తర్వుల్లోవెల్లడించారు.అలాగే విచారణ పూర్తయ్యే వరకు నాగర్‌కర్నూల్ జిల్లానే ఆయన ప్రధాన కేంద్రంగా ఉంటుందని, జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు.ప్రతి నెలా ఇతర ఉద్యోగం చేయడం లేదని ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా ట్రెజరీ అధికారికి సమర్పించాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.రైతుల భూ హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై ఎలాంటి రాజీ ఉండదని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, నిబంధనల అమలు తప్పనిసరి అని, నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.



# దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్, జూలై 04 (విజన్ ఆంధ్ర): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం 80వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, శాసనసభ్యులు పాయల శంకర్, అనిల్ జాదవ్ లతో కలిసి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, వెట్టిచాకిరి నిర్మూలనకై ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య ఆశయాలు అమూల్యమైనవని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని తలుచుకుంటూ, సమాజ అభ్యున్నతికి, జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య మహోన్నత వ్యక్తి అని, నాటి దోపిడీ వ్యవస్థపై ఆయన చూపిన ధైర్యం చిరస్మరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని కొనియాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహనీయుల చరిత్రను, త్యాగాలను భావితరాలకు అందించేందుకే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించుకుంటూ వారిని స్మరించుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, బిసి సంక్షేమ శాఖ అధికారి సోనియా, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో ఆహార భద్రతా అధికారుల ఆకస్మిక తనిఖీలు





నిజామాబాద్ జూలై04:( విజన్ ఆంధ్ర ): నిజామాబాద్ జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారులు గత 2 రోజులుగా వివిధ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు మరియు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గుర్తించిన ప్రధాన లోపాలు: 1. అసంతృప్తికర పరిశుభ్రత – వంటశాలలు మరియు పాత్రలు అపరిశుభ్రంగా ఉండడం 2. నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడకం 3. కృత్రిమ రంగు వేసిన మాంసంలి అమ్మకానికి ఉంచడం 4. ఫ్రిజ్‌లో ఆహారాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేయకపోవడం – కలుషితమైన ఆహారాన్ని వెంటనే ధ్వంసం చేయించడం జరిగింది 5. మూతలు లేని పాత్రల్లో ఆహారాన్ని బహిరంగంగా ఉంచడం అధికారుల హెచ్చరిక: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆహార వ్యాపారులు ఆహార పరిశుభ్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం కారణంగా ఆహారం కలుషితమై ప్రజారోగ్యానికి హాని కలిగే అవకాశం ఉంది. తీసుకున్న చర్యలు : నిబంధనలు ఉల్లంఘించిన ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు FSSAI చట్టం 2006 సెక్షన్ 32లి ప్రకారం Improvement Noticeలు జారీ చేయబడతాయి. 14 రోజుల్లో లోపాలను సరిచేయని వారిపై కఠినంగా జరిమానాలు విధించి, లైసెన్స్ రద్దు చర్యలు తీసుకోబడతాయి. FSSAI లైసెన్స్ లేని మరియు అపరిశుభ్రంగా ఉన్న దుకాణాల నుండి ఆహారాన్ని కొనుగోలు చేయవద్దని ప్రజలకు ఆహార భద్రతా శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## జర్నలిస్టు బర్లరాజు రెండవ వర్ధంతి కార్యక్రమం

**-కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం**



కౌడిపల్లి, జూలై 4 (విజన్ ఆంధ్ర): మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి లో జర్నలిస్టు బర్లరాజు రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మొదటగా వారి స్వగృహంలో రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ స్మృతి, చేతుల మీదుగా పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగరాజు చారి మాట్లాడుతూ... ఓరుగల్లు నైన్ న్యూస్ లో జర్నలిస్టుగా వీధులు నిర్వహిస్తూ గత రెండు సంవత్సరాల క్రితం ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి దర్శన నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు డ్యాంలో పడి నీట మునిగి మరణించడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. ఆయన జర్నలిస్టుగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి అందించిన సేవలు మరువలేని అన్నారు. రాజు మరణం కుటుంబానికి తీరనిలోటు అన్నారు. అనంతరం రాజు సగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్ గౌడ్, కారోబర్ ఎల్లం, ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారి, తోపాటు కుటుంబ సభ్యులు, రాజు స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**- మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కు విజ్ఞాపన పత్రం సమర్పణ**



కౌడిపల్లి, జూలై 4 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తపస్ మెదక్ జిల్లా కౌడిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలంటు స్థానిక తహసీల్దార్ కు శనివారం నాడు విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు నాయని నరేందర్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐదు డీఏలను పెండింగ్లో ఉంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ దేనని పిఆర్సి మూడు సంవత్సరాలుగా కాలయాపన చేస్తున్నారని పిఆర్సి నివేదికను తెప్పించుకొని పరిష్కరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని వెంటనే పీఆర్సీని ప్రకటించాలని అలాగే పెండింగ్లో ఉన్న ఆరు డిఏ లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షులు దాసు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తుందని ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల చిన్నచూపు తగదని పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని మార్చుకోవాలని అవసరం ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై పంపాలని అన్నారు. చానా పాఠశాలల ను మూసి వేయడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతుందని ఇటువంటి నిర్ణయాలను మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి తపస్ కౌడిపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసు ప్రభాకర్ బచ్చన్నపేట స్వామి జిల్లా ఉపాధ్యక్షులు నాయిని నరేందర్ గౌడ్ ఈగ కృష్ణమూర్తి మరియు నవాత్ చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి జాల దశరథం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ర్యావ శోభారాణి, మాచర్ల రమేష్, శ్రీకాంత్ శర్మ, నరేందర్,మొగులయ్య సంకీర్తన, మదూరి రమేష్, మార్కండేశ్వర్, జగదీష్, ప్రకాష్ లు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలి - ఎంపీ గోడం నగేశ్

**- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్, జూలై 04 (విజన్ ఆంధ్ర): జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఏ పీవో మంద మకరందు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, భౌతిక, ఆర్థిక పురోగతి, పెండింగ్ పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, వ్యవసాయం, ఐటిడిఏ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా, శిశు సంక్షేమం, ఉద్యానవనం, అటవీ, గిరిజన సంక్షేమం, క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేశ్ మాట్లాడుతూ.. కేంద్ర నిధులతో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో జాప్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. గత సమావేశం అనంతరం పనుల్లో పురోగతి కనిపించిందని, ప్రస్తుతం వర్కింగ్ సీజన్ కావడంతో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాలు నాణ్యంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం నిర్వహించి జిల్లాలోని సమస్యలను సమీక్షించి పరిష్కరించాలని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి - ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై 04 (విజన్ ఆంధ్ర): ప్రజలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో నమోదవుతున్న సైబర్ నేరాల స్వభావాన్ని పరిశీలిస్తే, సైబర్ నేరగాళ్లు ప్రతిరోజూ కొత్త పద్ధతులతో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులు, క్రెడిట్ కార్డు విభాగం, లోన్ సంస్థలు లేదా ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి ఆధార్, బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సూచించారు. అధికారిక నంబర్లు, వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే సమాచారాన్ని ధృవీకరించుకోవాలని తెలిపారు. ఇటీవల జిల్లాలో సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతాలు సృష్టించి యువతను బ్లాక్‌మెయిల్ చేయడం, ముద్ర లోన్ పేరుతో ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేయడం, క్యూఆర్ కోడ్‌లు పంపించి నగదు కాజేయడం, ఓఎల్ఎక్స్‌లో కొనుగోలు, విక్రయాల పేరుతో మోసాలు, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి క్రెడిట్ కార్డు, కేవైసీ, ఆధార్ వివరాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దోచుకునే ఫిర్యాదులు నమోదయాయని తెలిపారు. అలాగే అనుమతి లేకుండానే బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు జరగడం, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా గిఫ్ట్ హ్యాంపర్‌లు, బహుమతుల పేరుతో డబ్బులు వసూలు చేసి అనంతరం ఖాతాలను బ్లాక్ చేయడం, రుణాల పేరుతో నకిలీ రికవరీ ఏజెంట్లు కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడడం వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వారం జిల్లాలో మొత్తం 9 సైబర్ ఫిర్యాదులు నమోదయ్యాయని, వాటిలో సోషల్ మీడియా బ్లాక్‌మెయిల్, లోన్ ఫ్రాడ్, క్యూఆర్ కోడ్ మోసాలు, క్రెడిట్ కార్డు ఇంపర్సనేషన్, ఓఎల్ఎక్స్ మోసాలు వంటి వివిధ రకాల కేసులు ఉన్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. నమోదైన ప్రతి ఫిర్యాదుపై సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గోల్డెన్ అవర్ లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా...రైతు సంక్షేమానికి పెద్దపీట

**- జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ వెల్లడి**

**- నిజామాబాద్ శ్రద్ధనంద్ గంజ్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



నిజామాబాద్, జూలై 04 :( విజన్ ఆంధ్ర) తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, రైతాంగ ప్రయోజనాలు కాపాడడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ (మార్కెట్ యార్డు)లో రూ. 6.56 కోట్ల నిధులతో చేపడుతున్న షెడ్ల నిర్మాణాలు, మడిగెలు, సోలార్ విద్యుత్ తదితర పనులకు మంత్రి సీతక్క శనివారం నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ ఉమారాణి తదితరులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని, రాష్ట్రంలో రైతాంగ ప్రభుత్వం కొనసాగుతోందని అన్నారు. అప్పుల భారం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతులకు పంట రుణాల మాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యానికి బోనస్ అందజేయడం జరుగుతోందని గుర్తు చేశారు. రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున పంటలు సాగు చేశారని అన్నారు. ప్రతి పంటకు పూర్తిస్థాయిలో మద్దతు ధర చెల్లిస్తూ, చివరి గింజ వరకు కూడా ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకుందని తెలిపారు. పేద కుటుంబాలు కూడా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. తమకు అధికారాన్ని కట్టబెట్టిన ప్రజల సంక్షేమాన్ని విస్మరించకుండా, వారి అభివృద్దే ధ్యేయంగా అహరహం శ్రమిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎల్లవేళలా అండదండగా నిలువాలని కోరారు. కాగా, రాష్ట్రంలో పేరెన్నికగన్న నిజామాబాద్ మార్కెట్ యార్డుకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు వీలుగా ముఖ్యమంత్రి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డులోని అర్హులైన హమాలీలకు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ లు మంజూరు చేసేలా చొరవ చూపుతానని అన్నారు. హమాలీల కోసం ప్రత్యేకంగా బోర్డును ప్రకటించారని, ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీస వేతన చట్టాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. నిజామాబాద్ నగర సర్వతోముఖాభివృద్ధి కోసం త్వరలోనే మాస్టర్ ప్లాన్ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని, తద్వారా నగర ప్రజలకు అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, విరివిగా నిధులు మంజూరు అవుతాయని మంత్రి సీతక్క అన్నారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అధ్యక్షత వహించగా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, ఎ.ఎం.సీ పాలకవర్గ ప్రతినిధులు, రైతులు, హమాలీలు, గుమాస్తాలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి, మణికొండ పరిధిలో రూ. 2.95 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

**- లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం**





గండిపేట, జూలై 4 (విజన్ ఆంధ్ర):దనార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో ప్రజల సౌకర్యార్థం రూ. 2.95 కోట్ల (రూ. 295 లక్షలు) భారీ వ్యయంతో నూతనంగా నిర్మించిన పలు కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ భవనాన్ని శనివారం రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి భవనాలను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లు, మున్సిపాలిటీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగానే రూ. 2.95 కోట్ల నిధులతో ఈ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెం. 124లో స్థానిక ప్రజల శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల కోసం రూ. 200 లక్షల (2 కోట్లు) భారీ వ్యయంతో నిర్మించిన అత్యాధునిక కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెం. 127 పుప్పాలగూడ గ్రామం, నెమలి నగర్‌లో రూ. 65 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను స్థానికులకు అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా నెమలి నగర్ పరిధిలోనే చిన్న పిల్లలు, గర్భిణుల సౌకర్యార్థం రూ. 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు. “మున్సిపాలిటీల పరిధిలో జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నాం. పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ కమ్యూనిటీ హాళు ఎంతో ఉపయోగపడతాయి. అంగన్‌వాడీ భవనం ద్వారా చిన్న పిల్లలకు మెరుగైన వాతావరణం లభిస్తుంది. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో ఈ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తాం.“

ఘనంగా జరిగిన ప్రారంభోత్సవాలు కు తరలివచ్చిన జనం

పలు వార్డుల్లో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో స్థానిక మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు మరియు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన భవనాలు అందుబాటులోకి రావడంపై స్థానిక కాలనీల ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికారు, కృతజ్ఞతలు తెలిపారు.

## బుర్దపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



గద్వాల జూలై 04 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. నర్సింగ్ రావు అధికారులను ఆదేశించారు. శనివారం గద్వాల్ పట్టణం లోని బుర్దపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన,తరగతి గదులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం,మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ,ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉం డేలా చర్యలు తీసుకోవాలని హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు,విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



కడప, జులై 4 (విజన్ ఆంధ్ర) జిల్లాలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో, రోడ్డు ప్రమాదాలలో మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు ముగ్గురికి జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ లుగా నియమిస్తూ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నియామక పత్రం అందచేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తుంటారని,అటువంటి సిబ్బంది అకాల మరణం కుటుంబాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తుందన్నారు. మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక,సామాజిక సమస్యలను,సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి కుటుంబంలోని అర్హత కలిగిన వ్యక్తులలో ఒకరికి ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందచేయడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో అనారోగ్య సమస్యలతో మరణించిన చెందిన 1) డి.మల్లిఖార్జున , ఏ.ఆర్.ఎస్.ఐ కుమార్తె డి.మల్లికకు అదేవిధంగా రోడ్డు ప్రమాదాలలో మరణించిన 2) ఎస్.సతీష్ కుమార్ రాజు, సివిల్ కానిస్టేబుల్ సతీమణి అఖిల భారతి కి 3)బి.ముకుందర, సివిల్ కానిస్టేబుల్ సతీమణి పి.భారతి కి జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ లు గా నూతనంగా ఉద్యోగం మంజూరు చేయగా, జిల్లా ఎస్పీ నియామక ఉత్తర్వులు అందజేసి వారిని అభినందించారు. విధుల్లో తక్షణమే జాయిన్ అవ్వాలని, విధుల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని, తమకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు.కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు.ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డి.పి.ఓ ఏ.ఓ జి.సుజాత, సూపరింటెండెంట్ శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

## సర్ ను సమర్థవంతంగా నిర్వహించాలి

**- మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్**



విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ఎలాంటి దోషాలు లేకుండా సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే సర్ యొక్క ఉద్దేశ్యమని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఎ. మహేష్ కుమార్ అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెర్వాపూర్ వార్డులో బిఎల్వోలు చేపట్టిన సర్ నిర్వహణ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి, సందేహాలను అడిగి తెలుసుకున్నారు.సర్ పై సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేందుకు వార్డు కార్యాలయాల్లో హెల్ప్ డెస్కును ఏర్పాటు చేశామన్నారు.అందరూ సర్ కి సహకరించాలని కోరారు. సర్ ప్రక్రియలో ఓటర్లు తమ ఓట్లు తొలగిస్తారేమోనన్న ఆందోళన వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, బిఎల్వోలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, పిల్లలతో ముచ్చటించారు. అంగన్వాడీ కేంద్రం చుట్టూ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, పిల్లలకు ఆటపాటలతో బోధనను అందించాలని సిబ్బందికి సూచించారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి



కామారెడ్డి బ్యూరో జులై 4(విజన్ఆంధ్ర) : దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శనివారం కామారెడ్డి ఐడీఓసీ (×ణూజ)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. వై. గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన తొలి అమరవీరుడని అన్నారు. భూమి కోసం, పీడిత ప్రజల హక్కుల సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, జిల్లా అధ్యక్షులు భూమన్న, శ్రీనివాస్, చింతల శంకర్, జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, బహుజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య త్యాగం రైతాంగ పోరాటానికి చిరస్మరణీయం

**- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, జూలై 4 (విజన్ ఆంధ్ర బ్యూరో): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తిత్వమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం సమాజానికి ఆదర్శమని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, బీసీ అభివృద్ధి శాఖ అధికారి సౌజన్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కురుమ సంఘం ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.1.41 లక్షల విరాళం

**- అమెరికా ప్రవాస దంపతుల నుంచి నగదు అందజేత**



వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 4 (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనులకు అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు రూ.1,41,000 విరాళంగా అందజేశారు. వరంగల్‌కు చెందిన అమెరికా ప్రవాస దంపతులు జాట్లింగ్ కిరణ్ కుమార్, లక్ష్మి లావణ్య శనివారం రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎల్. రమాదేవికి రూ.1.41 లక్షల నగదు విరాళాన్ని అందజేశారు. విరాళం అందజేసిన దంపతులను ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం లడ్డూ ప్రసాదాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

## పునరుత్పాదక ఇంధన వినియోగంలో కేఎల్‌ఈఎఫ్ కు జాతీయ అవార్డు




హైదరాబాద్, జూలై 04 (విజన్ ఆంధ్ర) : కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ (కేఎల్ఈఎఫ్) న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ 10వ జాతీయ ఇంధన సామర్థ్య వలయ పోటీ-2026లో 'పునరుత్పాదక ఇంధన ఉత్తమ వినియోగం, అనువర్తనాలు' విభాగంలో ప్రథమ రన్నరప్ అవార్డును అందుకుందని కేఎల్‌ఈఎఫ్ ఛాన్సలర్ ఇంజినీర్ కొనేరు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 3,854.81 కిలోవాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యంతో కేఎల్‌ఈఎఫ్ 2025-26లో 59 లక్షల యూనిట్ల స్వచ్ఛ విద్యుత్ ఉత్పత్తి చేసి, విద్యుత్ అవసరాల్లో 50.9 శాతం తీర్చిందని తెలిపారు. సుస్థిర అభివృద్ధి, నెట్-జీరో కార్బన్ ప్రాంగణాల నిర్మాణానికి కేఎల్‌ఈఎఫ్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీ తరఫున అసోసియేట్ డీన్లు డి.శేషి రెడ్డి, డాక్టర్ కె.జె.బ్రహ్మ చారి అవార్డును స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఈఈ డైరెక్టర్ పి.శ్యామ్ సుందర్, ఈఈఎస్ఎల్ విభాగాధిపతి అభిషేక్ గుప్తా, సీఐఐ హర్యానా ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ వివేక్ ఠాకూర్ పాల్గొన్నారు.

### క్రమ శిక్షణ కు మారు పేరు జ్యోతి విద్యాలయ హై స్కూల్ - సి ఐ. జగన్నాథ్







శేరిలింగంపల్లి. జూలై 4: (విజన్ ఆంధ్ర) : క్రమ శిక్షణ కు మారు పేరుగా జ్యోతి విద్యాలయ హై స్కూల్ నిలుస్తుందని ఆర్.సి.పురం సర్కిల్ ఇన్స్ పెక్టర్ డాక్టర్ జగన్నాథ్ .బి హెచ్ ఇ ఎల్.టౌన్ షిప్ లోని జ్యోతి విద్యాలయ హై స్కూల్ లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంత బాగా జరగడం చాలా సంతోషకరమని, క్రమశిక్షణ, విద్యా నైపుణ్యం, మరియు అందరినీ కలుపుకొనిపోయే నాయకత్వ లక్షణాలు ఉన్న విద్యార్థులను కెప్టెన్స్ గా ఎన్నుకోవడం చాలా అభినందనీయమైన విషయమన్నారు. ఇలాంటి అర్హతలున్న విద్యార్థులే రేపటి సమాజానికి మంచి పౌరులుగా ఎదుగుతారనీ, పాఠశాలను అభినందిస్తూ పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను పెంచుతుందనీ, ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరి, ఫాదర్ అంబ్రోస్ బెక్ ల మార్గదర్శకత్వంలో, ఈ కొత్త స్టూడెంట్ లీడర్స్ అందరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, స్కూల్ కీర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆశిస్తున్నాననీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్. ఐ. ప్రియదర్శి. కెప్టెన్లకు స్లాష్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, స్కూల్ ఉపాధ్యాయురాళ్ళు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా ఐ డి ఓ సి జిల్లా సమీక్ష సమావేశం

**- పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి**
**ఎంపీ ఎమ్మెల్సీలు జిల్లా కలెక్టర్**
**- మీటింగులో సైతం ఫోన్లో చూస్తూ అధికారులు**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జులై 4 : సిద్దిపేట జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్నబియ్యం సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 36 శాతం అదనంగా వరిధాన్యం ప్రొక్యూర్మెంట్ పూర్తవడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఎవరూ వ్యవహరించరాదని స్పష్టం చేశారు జిల్లాలో ఇప్పటివరకు 6,351 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం మాత్రమే కొనుగోలు జరిగిందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సన్నబియ్యం సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ అవసరాలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ లేకుండా చర్యలుతీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెంకుటిళ్లు లేకుండా పక్కా ఇళ్లు ఉండేలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, జిల్లాలోని అన్ని పెంకుటిళ్లను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులనుఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు మంచి పురోగతి సాధిస్తున్నారని అభినందిస్తూ, పేదల సొంతింటి కలను సాకారం చేసేలా మరింత కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అసంపూర్తి మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బస్తీ దవాఖానల్లో వైద్యుల కొరత ఉంటే వెంటనే నియామక ప్రక్రియ చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని మంత్రి ఆదేశించారు. చిన్నచిన్న మరమ్మతు పనులను కూడా ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. టామ్ కామ్ సంస్థ ద్వారా నిరుద్యోగులకు విదేశాలలో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా దేశాల స్థానిక భాషలపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లాలో యువత ఈ కార్యక్రమంలో పాల్గొనేలా జిల్లాలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ జిల్లాలో 5.17 లక్షల ఎకరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, డ్రోన్ల ద్వారా ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన భూసమస్యలను పరిష్కరించాలని, మర్కుక్‌పాములపర్తి రహదారిపై డివైడర్ లైట్లు ఏర్పాటు చేయాలని, మల్లన్నసాగర్నిర్వాసితులకు పెండింగ్ పరిహారం త్వరగా అందించాలని కోరారు. సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేట్ ఆసుపత్రులునిర్వహించబడేలాచర్యలుతీసుకోవాలని, దుబ్బాకలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. నామాపూర్ గ్రామంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమం ద్వారా ఇండ్లపై సోలార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరా సమృద్ధిగా ఉందని జిల్లాకు 45 వేల మెటీరియల్ ఏరియా అవసరం కాగా ఇప్పటికే జిల్లాలో 10,000 మెట్రిక్ టన్నుల ఏరియా స్టాక్ ఉందని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, యూరియా యాప్ ద్వారా ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందేలా చర్యలుకొనసాగుతున్నాయని తెలిపారు. పంటల నష్టం నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, టూ బీహెచ్‌కే ఇళ్ల పెండింగ్ పనులను వేగవంతం చేసి, అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ, రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలు, యూరియా సకాలంలో అందేలా చూడాలని కోరారు. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, జనుము, జిలుగు విత్తనాల కొరత లేకుండా చూడాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ తొలగించాలని, సీజనల్ వ్యాధులపైప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో సి-సెక్షన్‌ల సంఖ్య తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని,నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, బస్తీ దవాఖానల్లో వైద్యులను నియమించాలని, పశువులకు అవసరమైన మందులు సకాలంలో అందించాలని, సిద్దిపేట సిరిసిల్ల వెళ్లే రైల్వే లైన్ మధ్యలో గల మూడు కెనాల్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారుఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ పథకాన్ని ఉపయోగించాలని, డిఇఓ ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, సన్నబియ్యం సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, భూసార పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కెనాల్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్యలను పరిష్కరించి, అసంపూర్తి రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు. ఎంఎల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని, జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు విస్తరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వంటేరు ప్రతాపరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మల్క కొమరయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

**- మూడపల్లిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేతుల మీదుగా ప్రారంభం**
**- 2600 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, 18 నెలల్లో నిర్మాణం పూర్తి లక్ష్యం**








చందుర్తి రాజన్న సిరిసిల్ల, జూలై 4 (విజన్ ఆంధ్ర బ్యూరో): చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్ఎస్) భవన నిర్మాణానికి శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూలి, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 2600 మంది విద్యార్థులకు అత్యాధునిక వసతులతో విద్య అందించేలా ఈ విద్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. విద్యారంగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమూల మార్పులు తీసుకొస్తున్నారని పేర్కొన్న ఆయన, డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో పాటు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో త్వరలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా రుద్రంగిలో రూ.46 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, మర్రిపల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం, రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లతో పనులు, మూలవాగు బ్రిడ్జి, రహదారి విస్తరణ, గోదాముల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూలి, మూడపల్లి ప్రాంతాన్ని అనువైన స్థలంగా ఎంపిక చేసి అన్ని సౌకర్యాలతో విద్యాలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి వసతి, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు, క్రీడా వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఎండీ గణపతి రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో మంజూరైన 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 60 చోట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, మూడపల్లి విద్యాలయ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందరెడ్డి, టీజీఈడబ్ల్యూ ఐడీసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## షాపింగ్‌ప్రియుల కోసం ఆర్.ఎస్.బ్రదర్స్‌లో ఆషాఢం ఛాలెంజ్ కేజీ సేల్ ప్రారంభం




హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అదేవిధంగా మహారాష్ట్ర ప్రాంతాల్లో షాపింగ్ ప్రియులు ఎదురు చూసే ఆషాఢం ఛాలెంజ్ కేజీ సేల్ ను ప్రముఖ వస్త్ర ప్రపంచం ఆర్.ఎస్. బ్రదర్స్ శుక్రవారంనాడు ఆరంభించింది. ముఖ్యంగా వస్త్రాలపై అత్యంత అధికంగా 70 శాతం తగ్గింపుతో 'అందానికి అందం – ఆదాకి ఆదా' ఈ ఆషాఢం ఛాలెంజ్ కేజీ సేల్ ప్రత్యేకత అని ఆర్.ఎస్ బ్రదర్స్ యాజమాన్యం ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. అత్యంత ప్రత్యేకమైన ఈ సందర్భం కొనుగోలుదారుల వార్డ్‌రోబ్స్‌ను సరికొత్త వెరైటీలతో, అందమైన డిజైన్లతో, ఆహ్లాదకరమైన రంగులతో కూడిన వస్త్ర వైవిధ్యంతో అలరిస్తోంది. ఫ్యాషన్ ప్రియులు, కుటుంబాల వారు ఈ ఆషాఢం ఛాలెంజ్ కేజీ సేల్‌ను సద్వినియోగం చేసుకోగలరని ఆశిస్తున్నాంమని షాపింగ్ ప్రియులకు స్వాగతం పలికారు. రాబోయే వేడుకలు, శుభకార్యాలు, పర్వదినాల వంటి సందర్భాలకు అవసరమైన నాణ్యమైన వెరైటీలను లాభసాటిగా, పొదుపైన, సరిసాటిలేని ధరలతో సొంతం చేసుకోవడానికి దీన్ని మించిన అవకాశం లేదని తెలిపారు. మల్టిపుల్ స్టోర్స్‌కు వెళ్ళాల్సిన అవసరం లేకుండా, ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ గార్మెంట్స్ అన్ని వెరైటీలు ఒకేచోట లభించే విధంగా పరిపూర్ణమైన ఫ్యామిలీ షాపింగ్ మాల్ పేరును సార్థకం చేసుకుంటూ ఆర్.ఎస్. బ్రదర్స్ ఏర్పాట్లు చేయడం విశేషమని తెలిపారు. ఈ ఏడాది ఆషాడం సేల్ ను తమ ప్రియమైన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోగలరని, లాభసాటి ధరలకు సొంతం చేసుకోగలరని ఆశిస్తూ, ప్రతీ ఒక్కరికీ ఆత్మీయ స్వాగతం పలుకుతున్నాం అని ఆర్.ఎస్. బ్రదర్స్ యాజమాన్యం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం: తపస్

### ములుగు జిల్లా వ్యాప్తంగా నిరసనలు స్థానిక తహసీల్దారుల ద్వారా సీఎంకు వినతి పత్రాలు.



ములుగు జూలై 04; విజన్ ఆంధ్ర ప్రతినిధి : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో శనివారం ములుగు జిల్లా వ్యాప్తంగా నిరసనలు జరిగాయి. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ములుగు మండలంలో తపస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి బలరామ్, ప్రధాన కార్యదర్శి లికొత్తపెల్లి కేదారిలి ఆధ్వర్యంలో తహసీల్దార్ ద్వారా సీఎంకు వినతి పత్రం సమర్పించారు. మల్లంపల్లి, వెంకటాపూర్ సహా ఇతర మండలాల్లోనూ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లైన

1. పీఆర్సీ అమలు: 51% ఫిట్‌మెంట్‌తో కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలి
2. డీఏలు: పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయాలి
3. లిబిల్లులు: ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు, పెన్షనర్ల బిల్లులకు నిధులు మంజూరు చేయాలి
4. పెన్షన్: సీపీఎస్ రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలి
5. ఇతర: కేజీబీవీ, మోడల్, గురుకుల, ఆశ్రమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి. పాఠశాలలకు మౌలిక వసతుల గ్రాంట్లు ఇవ్వాలి. ఉపాధ్యాయులపై మధ్యాహ్న భోజన బాధ్యతలు తొలగించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని తపస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రాజంపేట పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ

**- ఎస్పీ యం. రాజేష్ చంద్ర,**



కామారెడ్డి బ్యూరో జులై 4(విజన్ఆంధ్ర) : పారదర్శకత, ప్రజలకు మర్యాదపూర్వక సేవలు, రికార్డుల నిర్వహణ, సి సి టి ఎన్ ఎస్ ఏదో కూడుపుటని చేస్తున్నారని అప్‌లోడ్, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్‌పై ఎస్పీ ప్రత్యేక దృష్టి కామారెడ్డి జిల్లా పోలీసు అధికారి యం. రాజేష్ చంద్ర, రాజంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్, వివిధ కేసులకు సంబంధించిన రికార్డులు, సి సి టి ఎన్ ఎస్ అప్‌లోడ్ అప్‌డేషన్, కేసు ఫైళ్ల నిర్వహణ, స్టోర్‌రూమ్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, డ్యూటీ రోస్టర్‌ను సమీక్షించి, అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందేలా విధులను ప్రణాళికాబద్ధంగా కేటాయించాలని సూచించారు. అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, కేసులకు సంబంధించిన ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహించాలని, స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ భద్రపరచాలని ఆదేశించారు. సి సి టి ఎన్ ఎస్ లో నమోదయ్యే కేసులు, దర్యాప్తు వివరాలు, ఇతర సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అప్‌లోడ్ చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓర్పుతో విని, చట్టపరంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పనితీరులో పూర్తి పారదర్శకత పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, పరిశుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ప్రజాసేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పేర్కొన్నారు.

## విద్యార్థుల ప్రవేశాలను పెంచాలి

**- షేక్ సలాం**



కామారెడ్డి బ్యూరో జులై 4(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం శనివారం (04-07-2026) కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల అడ్మిషన్స్ ను పర్యవేక్షించారు. తరగతి గదులకు వెళ్లి మొదటి సంవత్సరం విద్యార్థులతో నేరుగా సంభాషించారు. విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని, భోధన సరిగా చెయ్యాలని అధ్యాపకు లకు ఆదేశించారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ పి. సంతోష్ రెడ్డి తెలిపారు.

# కలెక్టరేట్ లో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం



నిర్మల్ జిల్లా,జూలై 04,(విజన్ ఆంధ్ర);కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాటి కాలంలో తెలంగాణ ప్రజలను బానిసత్వపు సంకెళ్ళ నుంచి బంధవిముక్తి చేసేందుకు పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఎంతో తెగువతో నిజాం నిరంకుశత్వాన్ని, దొరల ఆగడాలపై వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతుల కార్యక్రమాలు ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. దొడ్డి కొమురయ్య ఆశయాలను అందరూ కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ బిసి సంక్షేమ అధికారి సత్యనారాయణ, పలువురు సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మున్సిపాలిటీ లో కొనసాగుతున్న SIR సర్వే



నిర్మల్ జిల్లా,జూలై 04,(విజన్ ఆంధ్ర); నిర్మల్ మున్సిపల్ ఛైర్పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి గార్లకు ఎస్ఐఆర్ సర్వే ఫారలను అందజేసిన అర్బన్ తహసీల్దార్ రాజు, ఉప తహసీల్దార్ శేఖర్ ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతు ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఒక్కరు తమ యొక్క వివరాలను పొందుపర్చుకోవాలని తెలిపారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మధు మోహన్**



గద్వాల జూలై 04 (విజన్ ఆంధ్ర బ్యూరో) : దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మధు మోహన్ అన్నారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నిర్మూలన కోసం దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దొడ్డి కొమురయ్య సేవలను గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,జిల్లా బిసి సంక్షేమ అధికారి అక్బర్ పాషా,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# కపాస్ క్రాంతి పత్తి విత్తనాల ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల జూలై 04 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు జిల్లా వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో గద్వాల డివిజన్ నందు సంబంధించిన రైతులకు కపాస్ క్రాంతి పత్తి విత్తనాలను ప్యాకెట్లను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ నాగేష్,మాజీ సర్పంచులు వాసు, విజమ్ భాస్కర్ రెడ్డి, నాయకులు వెంకటన్న, మహేశ్వర్ రెడ్డి, అధికారులు, నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బెస్తవార్పేట్‌లో ముందస్తు డ్రైనేజీ పనులు ముమ్మరం...



నిర్మల్ జిల్లా,జూలై 04,(విజన్ ఆంధ్ర); మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదేశాల మేరకు, ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మల్ పట్టణంలోని వార్డ్ నెం. 25 బెస్తవార్పేట్ ప్రాంతంలో డ్రైనేజీలు, మురికి కాలువలు (నాలాలు) పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా, నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ లక్కాకుల హరీష్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కన్వీనర్ గా బాధ్యతలు ఇచ్చిన అధినాయకత్వానికి ధన్యవాదాలు

**- టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 04 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ నియోజకవర్గ ఎస్ఐఆర్ కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన అధినాయ కత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు అని టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ శాసనసభ సభాపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ కు వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారసింగ్ జాదవ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అధినాయకత్వం అప్పగించిన బాధ్యతలకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ గురించి కార్యకర్తలకు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి న్యాయం చేకూరేలా చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగు ను ప్రోత్సహించాలి

**- కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి**

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



నిర్మల్ జిల్లా,జూలై 04,(విజన్ ఆంధ్ర); పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సీఎస్ సంజయ్ జాజు శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారులతో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. యూరియా, డిఎపి, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు. ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం తో మొదటి స్థానంలో ఉందని అన్నారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మండలాల వారిగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలను అమలుపరుస్తున్నామని చెప్పారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పటిష్ఠ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశామని, వైద్య శాఖ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకై సంధ్యారాణి సమర శంఖం!!

**- సింగరేణి కుంభకోణంపై విచారణకు డిమాండ్**

**- 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి**

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పణ**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 4 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ వేదికగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పరిరక్షణ కోసం రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కందుల సంధ్యారాణి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని శనివారం కలిసి ఒక సమగ్ర డిమాండ్ పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వెన్నెముకగా, 'మినీ రత్నా'గా పేరుగాంచిన సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వ అవసరావకాశాలు, అధికారుల బాధ్యతారాహిత్యం తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని ఆమె ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వేల కోట్ల రూపాయల విలువైన బాండ్లు కలిగి ఉన్న ఈ ప్రతిష్టాత్మక సంస్థ, నేడు రాష్ట్ర ప్రభుత్వ విభాగాలైన జెన్‌కో, ట్రాన్స్‌కోల నుండి రావాల్సిన రూ. 56 వేల కోట్ల భారీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల కనీసం కార్మికులకు సకాలంలో వేతనాలు కూడా ఇవ్వలేని దయనీయ స్థితికి చేరుకుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ యాజమాన్యం తన అంచనాలకు మించి, వాస్తవంగా ఉత్పత్తి కానటువంటి లక్షలాది టన్నుల బొగ్గును రికార్డుల్లో చూపించి, సెస్ రూపంలో కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారాన్ని మోస్తూ పెద్ద ఎత్తున బొగ్గు కుంభకోణానికి పాల్పడుతోందని ఆరోపించారు. దీనితో పాటు నైని బ్లాక్ బొగ్గు రవాణాకు సంబంధించిన కొత్త నిబంధనల ఉల్లంఘనలపై, మెడికల్ అన్‌ఫిట్‌నెస్ బోర్డు నిర్ణయాలలో జరుగుతున్న అవినీతి, పక్షపాత వైఖరిపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మరోవైపు సంస్థలో దశాబ్దాలుగా రక్తాన్ని చెమటగా మార్చి శ్రమిస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ సిఫార్సుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించడం లేదని, వారి కుటుంబాలకు కనీస సామాజిక భద్రత కరువైందని పేర్కొన్నారు. మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి ఇందులో 49 శాతం వాటా ఉన్నందున, ప్రత్యేక చొరవ తీసుకొని ఒక స్వతంత్ర దర్యాప్తు కమిటీని నియమించి ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ సింగరేణి సంస్థను సర్వనాశనం కాకుండా కాపాడాలని కందుల సంధ్యారాణి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ముక్తకంఠంతో కోరారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

**- విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన**

**- మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణపై సూచనలు**




నారాయణపేట, జూలై 4 (విజన్ ఆంధ్ర) : విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా షీ టీమ్ పోలీసులు జాజాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం సి టీం పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నప్ప లు మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.మహిళలు, బాలికల రక్షణ కోసం తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన షీ టీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు, సోషల్ మీడియాలో అసభ్యకర సందేశాలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని వివరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల కోసం డయల్ 100 ,112, మహిళల భద్రత కోసం షీ టీమ్, సైబర్ మోసాల కోసం 1930 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తపస్ నిరసన

## వికారాబాద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంతోష్ కుమార్, సురేందర్ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 04 ( విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పిఆర్సి రిపోర్ట్ తెప్పించుకొని 51% ఫిట్మెంట్ ప్రకటన చేయాలని వికారాబాద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంతోష్ కుమార్, సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ మండల తహసిల్దార్ కు నిరసన తెలుపుతూ మెమోరాశీదం ఇచ్చారు. 6 డిఏ లు వెంటనే ప్రకటించాలని వారు సూచించారు. మేనిఫెస్టోలో ఉన్న సిపిఎస్ రద్దు అంశంలో ప్రత్యేక చొరవ చూపి అందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల కు సంబంధించిన పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించాలి, పెన్షనర్ల బెనిఫిట్స్ జాప్యం చేయకుండా వారివి క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష మహిళ ఉపాధ్యాయుల సిబ్బంది సమ్మె కాలపు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ 010 పద్దు విషయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. హెల్త్ కార్డ్స్ విషయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో ఉన్న అన్ని సంఘాలు ట్రస్ట్ లో ఉండాలని వారు తెలిపారు. మార్గదర్శకాలు పూర్తి అయిన తర్వాతే వాటా కట్ చేయాలని వారు కోరారు. ఉపాధ్యాయుల వార్షిక ప్రమోషన్స్ ,ట్రాన్స్ఫర్ క్యాలెండర్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు హనుమయ్య, రాష్ట్ర బాధ్యులు కొత్తగడి అంజి రెడ్డి, జిల్లా అధ్యక్షులు కూర సంగమేశ్వర్, జిల్లా బాధ్యులు బసవరాజు, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్ర గుప్తా, మండల బాధ్యులు పండరి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, సంతోష్ కుమార్, మహేందర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య త్యాగం చిరస్మరణీయం

**- ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి**

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 4 ( విజన్ ఆంధ్ర ) : దొడ్డి కొమరయ్య త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కొనియాడారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# ప్రియదర్శిని నగర్ లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటిన మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అప్పాల గణేష్ చక్రవర్తి





నిర్మల్ జిల్లా,జూలై 04,(విజన్ ఆంధ్ర); పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ రోజు గౌతమ్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అప్పాల గణేష్ చక్రవర్తి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన, హరితమైన సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జగతి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ కౌన్సిలర్లు కత్తి నరేందర్, లక్కాకుల హరీష్, నాయకులు అజార్, అడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్2026 పనులను పరిశీలించిన డిప్యూటీ సీఈఓ చెన్నయ్య



గద్వాల జూలై 04 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ చెన్నయ్య అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్2026 లో భాగంగా డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ శనివారం గద్వాల్ మున్సిపాలిటీ లోని జెమ్మిచేడు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి జాబితాలో నమోదు చేయడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీతో పాటు డిజిటైజేషన్‌ను కూడా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు .డేటా నమోదు సమయంలో అత్యంత జాగ్రత్తతో వ్యవహరించి,ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.ఇంటింటి సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించి ఏఎస్‌డీ (అబ్సెంట్ ,షిఫ్టెడ్ ,డెడ్) జాబితాను క్షేత్రస్థాయి ధృవీకరణ ఆధారంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలను పూర్తిస్థాయి నిర్ధారణ అనంతరమే నమోదు చేయాలని స్పష్టం చేశారు.పెండింగ్‌లో ఉన్న డిజిటైజేషన్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు,డేటా ఎంట్రీలో డూప్లికేట్ నమోదులు,అసంపూర్ణ వివరాలు లేదా ఇతర లోపాలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ శ్రీనివాస రావు,గద్వాల తహసీల్దార్ హరి కృష్ణ,జిల్లా ఎన్నికల విభాగం అధికారులు,జిల్లా ఐటీ సపోర్ట్ బృందం,బూత్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 04 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన అమరవీరుడు దొడ్డి కొమురయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు. శనివారం ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. సామాజిక న్యాయం, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, సిపిఓ హరికృష్ణ, డీఐఈఓ నరేంద్ర, డిడబ్ల్యూఓ సుధారాణి, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజా సంఘాల నేతలు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర



# ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా లోపం..

## - నిబంధనలు పాటించకున్నా బేఫికర్




మెట్ పల్లి జులై 04 (విజన్ ఆంధ్ర) : మెట్ పల్లి డివిజన్ లో ప్రవేటు హాస్పిటల్స్ రోగులను పీల్చి పిప్పి చేస్తున్నా జిల్లా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తోన్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు లేని ప్రవేటు హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని సూచించినా జిల్లా అధికారుల తూతూ మంత్రపు చర్యలు చేపడుతూ మెడికల్ మాఫియా కు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వినబడుతున్నాయి. మెట్ పల్లి డివిజన్ లో వైద్యం వ్యాపారంగా మారడంతో ఇష్టారీతిగా ప్రవేటు హాస్పిటల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండగా అనుమతులు లేకుండానే నడుస్తున్న హాస్పిటల్స్, బయట ఒక డాక్టర్ పేరు చెప్పి లోపల వేరే డాక్టర్ తో వైద్యం చేపిస్తూ అడ్డగోలు బిల్లులు వసూలు చేస్తున్న హాస్పిటల్స్ పై అధికారులు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అనుమతులు లేని, నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై కొరడా ఝుళిపించాలని నిర్ణయించింది. వ్యాపార కేంద్రాలుగా మారిన ప్రైవేట్ ఆసుపత్రుల ఆట కట్టి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని చెబుతున్న నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు అధికారులు. రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులపై, డాక్టర్లు, సిబ్బంది, కనీస వసతులు లేని, నిబంధనలు పాటించని ఆసుపత్రుల గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కనీస వసతులు ఉండట్లేదని ఆసుపత్రులలో ప్రధాన సమస్యలపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టిసారించడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. డాక్టర్లు లేక నర్సింగ్ సిబ్బంది లేకపోయినా కేవలం డాక్టర్ సర్టిఫికెట్లు మాత్రమే చూపించి ప్రైవేట్ ఆనువత్రులు నిర్వహించేందుకు అనుమతులు పొందుతున్నారని ఆరోపణలున్నాయి. కనీస వసతులు లేని ఆసుపత్రుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపీలకు, పీఎంపీలకు, అంబులెన్సు డ్రైవర్లకు కమీషన్ల ఎరచూపించి పేషెంట్లను రప్పించుకుంటూ, ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తారు, ఏ శస్త్ర చికిత్సకు ఎంత డబ్బు చెల్లించాలి అనే బోర్డులను ప్రదర్శించాల్సి ఉ ంటుంది. కానీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స కోసం దేనికెంత చెల్లించాలి అని సూచించే బోర్డులు లేవు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న డమోగ్నోస్టిక్స్, ఫిజియోథెరపీ, పాథాలాజికల్ ల్యాబ్లు ఫీజుల విషయంలో కూడా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసిన ఈ విషయాల గురించి పట్టించుకోలేదని విమర్శలున్నాయి.

## స్వయంభూ శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ క్షేత్రంలో ఘనంగా సరస్వతి పూజలు అక్షరాభ్యాసాలు



కాజిపేట్ జులై 04 ( విజన్ ఆంధ్ర ) కాజీపేట లోని గల స్వయంభూ శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ క్షేత్రంలో ఈరోజు హనంకొండ లోని గల ఓయాసిస్ అనాథ ఆశ్రమ విద్యార్థులు సరస్వతి పూజలు నిర్వహించుకున్నారు. ఓయాసిస్ సంస్థ స్థాపకుడు వద్దిరాజు చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో... ఆయనవోలు రాధాకృష్ణ సిద్ధాంతి విద్యార్థులందరి పేర్ల మీద విద్యా గణపతి, జ్ఞానముద్ర సరస్వతి పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యను ఆరంభించే చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రోహిత్ ఉపాధ్యాయ, శివం త్రివేది మరియు కార్యకర్తలు శీనమ్మ, ఉమారాణి, సునంద, భాగ్యలక్ష్మి, శైలజ, కవిత తదితరులు పాల్గొనీ సరస్వతీ స్తోత్ర పారాయణం ఖడ్గమాల స్తోత్ర పారాయణం నిర్వహించారు.

# తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూలై 04:(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, ఉప్పల రమేష్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి, కంచకట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, మన్యం యాదగిరి, దున్న శ్యామ్, జిల్లా కార్యదర్శి టీఎన్జీవోస్ యూనియన్,స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంచార్జ్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ డి మదన్ మోహన్ రావు



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 04 ( విజన్ ఆంధ్ర ) : ఇంచార్జ్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ డి మదన్ మోహన్ రావు మరియు హసన్పర్తి డిప్యూటీ సివిల్ సర్జన్ గా ఈ రోజు విధుల్లో చేరిన డాక్టర్ శ్రీ కృష్ణారావు లను అభినందించిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది హసన్పర్తి డిప్యూటీ సివిల్ సర్జన్ గా డాక్టర్ ఏ . కృష్ణారావు ఈరోజు విధుల్లో చేరడం జరిగింది. ఈనెల 30 న డాక్టర్ మహేందర్ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో డాక్టర్ శ్రీ కృష్ణారావు ను రాష్ట్ర ఆరోగ్య సంచాలకులు నియమించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మదన్ మోహన్ రావు మరియు డాక్టర్ శ్రీకృష్ణారావు లను డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి , డాక్టర్ రుబీనా, డాక్టర్ శ్రీనివాస్ ప్రోగ్రాం అధికారులు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అభినందించడం జరిగింది .

# జోస్ అలుక్కాస్ 'సిగ్నేచర్ జ్యువెలరీ షో ప్రారంభం

హైదరాబాద్, జూలై 04 (విజన్ ఆంధ్ర) : జోస్ అలుక్కాస్ నగరంలోని చైతన్యపురి షోరూమ్‌లో జూలై 4 నుంచి 26 వరకు 'సిగ్నేచర్ జ్యువెలరీ షో'ను నిర్వహిస్తోందని ఆ సంస్థ ఎండీ పాల్ అలుక్కాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో అంతర్జాతీయ ప్రమాణాలతో ధ్రువీకరించబడిన సహజ వజ్రాభరణాలు, ప్రత్యేక బ్రైడల్ కలెక్షన్లు, ఆధునిక డిజైన్లు ప్రదర్శనతో పాటు విక్రయానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రదర్శన సందర్భంగా వజ్రాభరణాలపై 25 శాతం వరకు తగ్గింపు, కొనుగోలు చేసిన ప్రతి క్యారెట్‌కు 500 మిల్లీగ్రాముల బంగారు నాణెం ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్ జూలై 9 వరకు వర్తిస్తుందని, అలాగే పాత 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను 0 శాతం లాస్‌తో వజ్రాభరణాలుగా మార్పిడి చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

# ప్రతి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపే దిశగా అధికారులు పనిచేయాలి

## - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




గద్వాల జూలై 04 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రతి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపే దిశగా అధికారులు లక్ష్యబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, తాగునీటి సరఫరా,సాగునీటి నిర్వహణ,వైద్య ఆరోగ్య సేవలు, విద్యా రంగం,ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రానున్న ఆరు నెలల్లో ప్రతి జిల్లాలో అభివృద్ధిలో గణనీయమైన మార్పు కనిపించేలా అధికారులు లక్ష్యబద్ధ కార్యాచరణతో పని చేయాలన్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించే విధంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని తెలిపారు.ప్రజల సంక్షేమం,సమగ్ర అభివృద్ధికి దోహదపడే వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణాత్మక కార్యక్రమాలతో అధికారులు ముందుకు రావాలని అన్నారు. త్వరలో జిల్లాలను సందర్శించి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. జిల్లాల్లో నమోదవుతున్న వర్షపాత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాభావం లేదా అధిక వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కాంటింజెన్సీ క్రాప్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలన్నారు.రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించాలని సూచించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా,వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు,వైద్య సిబ్బంది, చికిత్సా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల పోషకాహారాభివృద్ధి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయం,తాగునీటి సరఫరా, సాగునీరు, వైద్య ఆరోగ్య సేవలు, విద్య, వర్షాకాల పరిస్థితులతో పాటు ఇతర శాఖల పురోగతిపై జిల్లాల వారీగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను తెలిపారు. గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన సేవలు,తాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నివారణ,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,సంబంధిత శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే అగ్రగామిగా నిలపాలి




సూర్యాపేట జూలై 04:(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధన దిశగా కార్యాచరణ చేపట్టి తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు. వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, సాగునీరు, విద్య, వాతావరణ పరిస్థితులపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐ.డీ.ఓ.సీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ చిన్న జిల్లాలు ఉండడం వల్ల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని, చిన్న సమస్యలు కూడా అధికారుల దృష్టికి వస్తాయని తెలిపారు. చిన్న జిల్లాల్లో ఐ.ఏ.ఎస్. అధికారులు అద్భుత ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రతి జిల్లా రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా తనదైన అజెండాతో ముందుకు సాగాలని అన్నారు. సమష్టి కృషితో వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని తెలిపారు. జిల్లాల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.వర్షపాతం పరిస్థితులను సమీక్షిస్తూ కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో అధిక వర్షపాతం, 19 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 11 జిల్లాల్లో లోటు వర్షపాతం, ఒక జిల్లాలో అత్యల్ప వర్షపాతం నమోదైందన్నారు.రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందుతున్న నేపథ్యంలో రైతుల మొబైల్ నంబర్లు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని, ప్రతి రైతుకు తెలుగు భాషలో వ్యవసాయ సూచనలు, వర్షపాతం వివరాలు, వాతావరణ హెచ్చరికలు ఎస్.ఎం.ఎస్.ల ద్వారా నిరంతరం పంపించాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన యూరియా నిల్వలు రాష్ట్రంలో తగినంతగా ఉన్నాయని, ప్రతి రైతుకు అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో యూరియా అందేలా చూడాలని సూచించారు. యూరియా వృథా కాకుండా, అవసరానికి మించి వినియోగించకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం బోనస్ అందిస్తున్న ఏడు రకాల సన్న వరి వంగడాల పై రైతులకు స్పష్టమైన సమాచారం చేరేలా చూడాలని, ఆయా వంగడాల విత్తనాలు ప్రతి మండలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరి సాగు విస్తీర్ణాన్ని ప్రణాళికాబద్ధంగా తగ్గిస్తూ కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణాలు, నగరాలకు సమీపంలోని రైతులు కూరగాయల సాగు చేపట్టేలా ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా స్థాయిలో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో వెంటనే సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. యాంటీ లార్వా కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని, ప్రతి శు క్రవారం అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గురుకులాలు, హాస్టళ్లలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాల్లో ప్రతిరోజూ సీజనల్ వ్యాధుల నివేదికలను సమీక్షిస్తూ అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణుల జాబితాను ముందుగానే సిద్ధం చేయాలని, వారిని ఆరోగ్య సిబ్బంది నిరంతరం ఫాలో అప్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు. గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నుంచి పట్టణాలు, నగరాలు, గ్రామాలకు బల్క్ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు సమన్వయంతో ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ లీకేజీ లను వెంటనే నివారించాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీరు అత్యంత విలువైనదని, ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టం కొనసాగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన వీ.బీ.జీ.ఆర్.ఏఎం.జీ పథకాన్ని అన్ని జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో చేపట్టే తాగునీటి పనులకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ కార్యక్రమంపై మంత్రివర్గం సమగ్ర సమీక్ష నిర్వహించిందని, ప్రస్తుతం ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలలో భాగమయ్యారని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం, అల్పాహారం తీసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, దీంతో నాణ్యత నియంత్రణ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జెడ్పి సీఈవో శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిపిఓ యాదగిరి సంబంధిత శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం వ్యవసాయ సాగుకు అన్ని శాఖలు సమన్వయంతో సన్నద్ధం కావాలి

## - జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్




కామారెడ్డి బ్యూరో జులై 4(విజన్ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, త్రాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యం, విద్య, వాతావరణ పరిస్థితులు, ఉద్యానవనం, ఆయిల్ పామ్ విస్తరణ, రైతు రిజిస్ట్రీ, సూక్ష్మ సాగునీరు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, వానాకాలం–2026 వ్యవసాయ సీజన్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, ఎరువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ నమోదు వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు, తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో అమలు చేయాలని, ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఫేషియల్ రికగ్నిషన్ విధానం, డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పథకం అమలును సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వానాకాలం వ్యవసాయ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచాలని, రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లాలో త్రాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను నాణ్యతతో అమలు చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, ప్రోహిబిషన్ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఇ=ఇూ) పీడీ దామోదర్ , వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో చందర్, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లిఖార్జున్ జిల్లా ప్రణాళిక అధికారి రఘునందన్,తదితర అధికారులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతిక దొడ్డి కొమురయ్య అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మట్..



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 4.. (విజన్ ఆంధ్ర) : సమాజంలో అణిచివేత ,అన్యాయం ,దోపిడి కి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు స్వర్గీయ దొడ్డి కొమురయ్య అనగారిన వర్గాల ఆత్మగౌరవా ప్రతీక అని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మట్ అన్నారు..శనివారం సమీకృత కలెక్టర్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కామిడే అనిల్ ,ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగ ,జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో అణిచివేత, అన్యాయం ,దోపిడీ భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడు అన్నారు, సరిగే దొడ్డి కొమరయ్య గారి త్యాగం తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ యాదవ్, బీసీ సంఘం నాయకులు రూప్ నార్ రమేష్,బిసి కుల సంఘం నాయకులు, ఇన్చార్జి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

### వనపర్తి జిల్లా మదనాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో

# విద్యార్థుల అవస్థలు



- విద్యుత్ షాక్ తో విద్యార్థి గాయాలు.. రహస్యంగా ఉంచిన గురుకుల సిబ్బంది
- విద్యార్థులకు రక్షణ ఎక్కడ
- జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలంటున్న విద్యార్థులు
- సమస్యలు వలయంలో మదనాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల






వనపర్తి జిల్లా బ్యూరో జులై 04 (విజన్ ఆంధ్ర ): పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన సౌకర్య లేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలురు పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మదనాపురం గురుకులంలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల గత రెండు రోజుల క్రితం విద్యార్థి విద్యుత్ షాక్ గురైన విషయాన్ని గురుకుల సిబ్బంది రహస్యంగా ఉంచారు. పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం అనేక పథకాలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం గురుకులంలో సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. గురుకుల పాఠశాలలో విద్యుత్ నియంత్రణ సక్రమంగా లేకపోవడం వల్ల విద్యార్థి విద్యుత్ శాఖ గురయ్యాడని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాలలో సరైన బాత్రూంలో మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల విద్యార్థులు బైర్ భూమికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడ ఏ విషపురుగు సంచరిస్తుందో అని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులకు బాత్రూం లేకపోవడంతో నల్లాల ముందు స్థానం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం బోధన సిబ్బందిని ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం లో బోధించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి పరిశీలించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత పర్యవేక్షణ గురుకులంలో కొరబడిందని దీంతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మదనాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ను వివరణ కోరగా నేను సెలవులో ఉన్నాను అక్కడ వైస్ ప్రిన్సిపాల్ ఉన్నారని తెలిపారు. అక్కడ ఉన్న వైస్ ప్రిన్సిపాల్ కొన్ని అనివార్య కారణాలవల్ల బయటికి వెళ్ళినట్టు సిబ్బంది తెలిపారు. విద్యార్థుల భద్రత పైన సౌకర్యాల పైన జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి పరిశీలన చేయాలని, గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# సైలెన్సర్ మోత హల్ చల్..!

- హడలెత్తిస్తున్న ద్విచక్ర వాహన రైడర్లు
- పోటాపోటీగా సైలెన్సర్ మఫ్లర్లు తీసివేత
- నీ వాహన శబ్దం ఎక్కువనా.. నా వాహన శబ్దం ఎక్కువనా అంటూ పోటీ..
- శబ్ద కాలుష్యం తో ప్రజలకు ఇబ్బందులు
- ఈ శబ్ద కాలుష్య ఆగడాలు ఆపేదెవరు ?
- శ్రీమంతుల వాహనాలని చోద్యం చూస్తున్న అధికారులు







మంచిర్యాల టౌన్, జూలై 04 (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల ప్రాంతంలో నేటి యువత వల్ల భయానక వాతావరణం నెలకొంటుంది వివరాల్లోకి వెళితే రాత్రి పగలు తేడా లేకుండా అధిక ఖరీదైన వాహనాల రైడర్లు ప్రజల చెవులకు చిల్లులు పడేలా హల్చల్ చేస్తున్నారు. ఖరీదైన వాహనం వచ్చిందంటే చాలు దాని శబ్దనికి భయపడాల్సిన పరిస్థితి ప్రజలకు ఎదురవుతున్నది. ద్విచక్ర వాహనాలు ఖరీదు చేసే సమయంలో ఉండే సైలెన్సర్ తీసివేసి వాటి స్థానంలో మఫ్లర్ లేని సైలెన్సర్లు బిగించి ప్రజలకు ఇబ్బంది కలిగేటట్టు చేస్తున్నారు. రాత్రి 10 తర్వాత చెప్పనక్కర్లేదు రైడర్లు పోటాపోటీగా తమకు ఇష్టం వచ్చినట్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ నీ వాహనం ఎక్కువ శబ్దం వస్తదా నా వాహనం ఎక్కువ శబ్దం వస్తుందా అని పోటీగా నడుపుతూ ప్రజలకు శబ్ద కాలుష్యం తో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం షోరూమ్ నుండి వచ్చే ద్విచక్ర వాహనాల సైలెన్సర్ తీసివేసి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ బిగించడం ఇది చట్ట విరుద్ధం సంవత్సరం క్రితం ఇలాంటి వాహనాల పై తీసుకున్న చర్యలు ఇప్పుడు తీసుకోకపోవడంపై విమర్శలకు దారి తీస్తున్నాయి. అధికారులు కూడా చూసి చూసినట్టు వ్యవహరించడం పై ప్రజలు మండిపడుతున్నారు. ఈ ద్విచక్ర రైడర్లు అధికంగా శ్రీమంతుల వాహనాలని, అందుకే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా శబ్ద కాలుష్యం వలన గుండె పగిలేంత శబ్దంతో వాహనాలు నడిపిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### టీబీ, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ శిబిరాలను

# ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ముందస్తు వ్యాధి నిర్ధారణతో ప్రాణాలను కాపాడుకోవచ్చు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- భీమారంలో టీబీఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి , జూలై 4 ( విజన్ ఆంధ్ర ) : ఆరోగ్యపరంగా అధిక ప్రమాదం (హైరిస్క్) ఉన్న వర్గాల కోసం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న క్షయవ్యాధి (టీబీ), అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ ) స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. శనివారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీమారం పాత గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టీబీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్ రావు శిబిరం నిర్వహణ, అందిస్తున్న సేవలపై కలెక్టర్‌కు వివరించారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 60 సంవత్సరాలు పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, గతంలో టీబీ చికిత్స పొందిన వారు, వారి కుటుంబ సభ్యులు, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు, ధూమపానం చేసే వారు, రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్న వారికి మొబైల్ డిజిటల్ ఎక్స్‌రే ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్షయవ్యాధిని ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స ప్రారంభించడం, పోషకాహారం తీసుకోవడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ, మొబైల్ ఎక్స్‌రే సేవలు, నిక్షయ్ పోర్టల్, ఎన్‌సీడీ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు ప్రక్రియను పరిశీలించారు. టీబీ చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పోషకాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యం దేశంలో క్షయవ్యాధి నిర్మూలనేనని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అత్యాధునిక, ఖరీదైన చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని చెప్పారు. టీబీ రోగులకు చికిత్స కాలంలో నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా ప్రతి నెల రూ. 1,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధిపై ఎలాంటి అపోహలకు లోనుకాకుండా రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ భరత్, డాక్టర్ మానస, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, టీబీ యూనిట్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు

# “దొడ్డి కొమురయ్య కురుమ“



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్మెట్ జూలై 4 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ పోరాట పటిమ దేశానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 80వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రం సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భూమి కోసం భుక్తి కోసం పెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విసునూరి దొర రామచంద్రారెడ్డి ఆగడాల వ్యతిరేకించినందున దొర గుండాల కాల్పుల్లో వీర మరణం పొందినారన్నారు. నాటి తొలి అమరత్వం తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిందని, ఎర్రజెండాలతో బరిసెలతో దొరలను ఎదిరించిన వీరులు ఎందరో అమరులయ్యారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. నిజాం రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనమైందని అన్నారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు పాత్ర మరువలేనిదని, నేడు వచ్చిన తెలంగాణలో సామాజిక న్యాయం ఆర్థిక సమానత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఓట్లు తొలగిస్తున్నారని, ఇందులో బిజెపి కుట్ర దాగి ఉందని, నిష్పక్షపాతంగా అధికారులు వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండే విధంగా కృషి చేయాలని, లేనియెడల మరో పోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గుడిసె వాసులకు న్యాయం చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6 తారీఖున ఇందిరా పార్క్ లో జరిగే వామపక్షాల మహా ధర్నా లో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మెట్టు శాఖ కార్యదర్శి వర్త్య రమేష్, మహిళా సమైక్య నాయకులు చందన, అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామ పంచాయతీ 13వ వార్డు సభ్యురాలు కేతరాజు మంజుల, బిక్షపతి, నాగేశ్వరరావు, సుల్తాన్, నరసయ్య, ఎనుగోటి లక్ష్మిప్రియా, పేరాల లక్ష్మి, వాసిరెడ్డి లక్ష్మి, లలిత, వైశాలి, మానెమ్మ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇకనైనా తెరుస్తారా కాంగ్రెస్ పట్టణ కార్యాలయం..?

- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం మళ్ళీ సందడిగా మారే రోజెప్పుడు..?
- పట్టణ కాంగ్రెస్‌కు కార్యాలయమే కేంద్రంగా మారుతుందా..?
- కార్యాలయం తెరిస్తేనే పార్టీకి కొత్త ఊపు..
- ఇకపై అన్ని కార్యక్రమాలు అక్కడి నుంచే నిర్వహిస్తారా..?
- కార్యాలయం మూత.. కార్యకర్తల్లో అసంతృప్తి
- పట్టణ పార్టీ కార్యాలయంలోనే కార్యక్రమాలు నిర్వహించాలి..!






సూర్యాపేట జూలై 04:(విజన్ ఆంధ్ర) : ఒక రాజకీయ పార్టీ బలం కేవలం పదవుల్లోనే కాదు, సంస్థాగత నిర్మాణంలోనూ కనిపిస్తుంది. ఆ నిర్మాణానికి ప్రతీకగా నిలిచేది పార్టీ కార్యాలయం,నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాల్సిన పట్టణ కాంగ్రెస్ కార్యాలయం మళ్లీ చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వినిపిస్తోంది.ఇటీవలి కాలంలో అన్ని పార్టీ కార్యక్రమాలు జిల్లా కార్యాలయంలో నిర్వహించబడుతున్నప్పటికీ, పట్టణ కార్యక్రమాలు కేంద్రీకృత వేదిక లేకపోవడం సంస్థాగతంగా లోటుగా కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పట్టణ కార్యాలయం నిరంతరం తెరిచి ఉండి, అక్కడి నుంచే పార్టీ సమావేశాలు,విలేకరుల సమావేశాలు,సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై చర్చలు నిర్వహిస్తే పార్టీకి మరింత క్రమబద్ధమైన రూపం వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అధికారంలో ఉన్న సమయంలో పార్టీ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండటం నాయకత్వ చురుకుదనానికి సంకేతంగా భావిస్తారు. ప్రజల సమస్యలు వినడం, కార్యకర్తలతో సమన్వయం పెంచడం, పార్టీ నిర్ణయాలను పారదర్శకంగా ప్రకటించడం వంటి అంశాలకు కార్యాలయమే వేదిక కావాలని కార్యకర్తలు కోరుతున్నారు.ఇప్పటి నుంచి పట్టణ కాంగ్రెస్‌కు సంబంధించిన ప్రతి ముఖ్య కార్యక్రమం పార్టీ కార్యాలయంలోనే నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభిస్తే సంస్థాగత ఐక్యతకు,కార్యకర్తల్లో నమ్మకం పెంపొందించడానికి దోహదపడుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పార్టీ బలం వ్యక్తుల చుట్టూ కాకుండా సంస్థ చుట్టూ కేంద్రీకృతమైతేనే దీర్ఘకాలికంగా బలపడుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయం 12 సంవత్సరాలుగా మూతపడి శిథిలావస్థలో ఉండడం నూతన అధ్యక్షుడికి సవాల్ గా మారింది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే పట్టణ కార్యాలయం తాళం వేసి ఉండడం కార్యకర్తల్లో అసంతృప్తికి దారితీస్తోందని చర్చ జరుగుతోంది.ప్రజా సమస్యలపై స్పందించాల్సిన నాయకులు, పార్టీ కార్యక్రమాలకు కేంద్రంగా ఉండాల్సిన కార్యాలయం మూతపడటంతో పట్టణ కార్యకర్తలు ఎక్కడికి వెళ్లాలనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది. కొత్తగా నియమితులైన నాయకత్వం కార్యాలయాన్ని ఇప్పుడైనా తెరుస్తుందా ..? పార్టీ కార్యకలాపాలను ఎప్పుడు ప్రారంభిస్తుంది..? అనే ప్రశ్నలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే వేదికగా మారాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. ఇకనైనా పట్టణ కార్యాలయానికి తాళం తీసి కార్యకలాపాలు ప్రారంభిస్తారా..? అనే ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రధాన చర్చగా మారింది.కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయం పార్టీ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారాలని కార్యకర్తలు కోరుతున్నారు.పార్టీ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటే కార్యకర్తలకు నాయకత్వంతో నేరుగా మాట్లాడే అవకాశం లభించడంతో పాటు ప్రజలకు కూడా పార్టీపై మరింత విశ్వాసం పెరుగుతుందని వారు చెబుతున్నారు. కార్యాలయం సజీవంగా ఉంటే పార్టీ సంస్థాగత బలం పెరుగుతుందని, కొత్త కార్యకర్తలు కూడా ఆకర్షితులవుతారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పార్టీ అధికారంలో ఉన్న ఈ సమయంలో పట్టణ కార్యాలయాన్ని పూర్తి స్థాయిలో వినియోగిస్తూ ప్రతిరోజూ పార్టీ కార్యకలాపాలు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నారు. పట్టణ కార్యాలయం మళ్లీ పార్టీ చైతన్యానికి చిరునామాగా మారాలని కార్యకర్తల ఆకాంక్షగా వినిపిస్తోంది.

# పౌరసరఫరాల ఎ ఎఫ్ సి ఐ అధికారులతో సమీక్ష సమావేశం లో జిల్లా కలెక్టర్



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి 4 జూలై : సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ సిద్ధిపేట కలెక్టరేట్‌లో శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ అధ్యక్షతన సీఎంఆర్ డెలివరీలు మరియు స్థల లభ్యత (రాజుూఖఎవ) సంబంధిత అంశాలపై కలెక్టర్ (పౌరసరఫరాలు), పౌర సరఫరాల అధికారులు, ఎఫ్‌సీఐ అధికారులు మరియు రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని, జిల్లాల వారీగా, రైస్ మిల్లుల వారీగా రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి వాటిని తప్పనిసరిగా సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు లక్ష్యాల సాధనను సమీక్షిస్తూ, ప్రత్యేక పర్యవేక్షణ అధికారుల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. ఎఫ్‌సీఐ అధికారులు స్టాక్ అలాట్‌మెంట్లు, ఆన్‌లైన్ అనుమతులు, ఔ×చీ+ూ బుకింగ్‌లు, గోదాములలో స్థల లభ్యత వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశించారు. అధిక పరిమాణంలో సీఎంఆర్ సిద్ధంగా ఉంచిన, అధిక సామర్థ్యం కలిగిన రైస్ మిల్లులకు అదనపు స్టాక్‌లు/బెడ్లు కేటాయించి డెలివరీలను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా సిద్ధిపేట జిల్లాకు సమీపంలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాములను వినియోగించుకొని రవాణా దూరాన్ని తగ్గించడం ద్వారా సీఎంఆర్ డెలివరీలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు తగిన సంఖ్యలో హమాలీలు, రవాణా వాహనాలు, పని వేళలను ఏర్పాటు చేసుకొని జిల్లా నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ డెలివరీలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లాలో సీఎంఆర్ డెలివరీల పురోగతిని కూడా డైరెక్టర్ సమీక్షించారు. వానాకాలం (ఖరీఫ్) 2025–26 సీజన్‌లో మొత్తం 2,76,058 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 1,32,994 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయబడగా, 48.18 శాతం లక్ష్యం సాధించబడింది. అలాగే యాసంగి (రబీ) 2025–26 సీజన్‌లో మొత్తం 1,57,052 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 21,953 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయబడగా, 13.98 శాతం లక్ష్యం సాధించబడింది. మిగిలిన సీఎంఆర్ డెలివరీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు, పౌర సరఫరాల అధికారులు, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.